శుక్రవారం
05-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 194
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

82కు పెరిగిన జపాన్ భూకంప మృతులు

టోక్యో: జపాన్‌లో భారీ భూకంపం వల్ల మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. గురువారం మధ్యాహ్నానికి 82కు పెరిగింది. ఇషికా ప్రొఫెక్చర్‌లోని వజిమా నగరంలో 48 మరణాలు నమోదయ్యాయి. ఈ మేరకు స్థానికులు తెలిపినట్లు క్యోడో జాతీయ వార్తాసంస్థ వెల్లడించింది. అవసరమైన సాయాన్ని 'పుష్ టైప్ మద్దతు'లో భాగంగా అందిస్తున్నట్లు జపాన్ ప్రభుత్వం వెల్లడించింది. భూకంప దృష్ట్యా మరో 40 బిలియన్ యెన్‌ల బడ్జెట్‌ను ఆమోదించేందుకు ఈనెల 9న కేబినెట్ సమావేశాన్ని ప్రధాని కిషిదా నిర్వహించనున్నారు. ఈ బడ్జెట్ 2016లో కుమామోటో భూకంపాలకు మంజూరు చేసిన 23 బిలియన్ యెన్‌ల కంటే దాదాపు రెట్టింపు అని అధికార వర్గాలు తెలిపాయి.

మూడు ముగిసినట్టే

- వైసీపీ నినాదానికే మూడు రాజధానులు పరిమితం
- విశాఖ వెళ్లేందుకు మూడేళ్లుగా విశ్వయత్నం
- సుప్రీంలో విచారణ ఏప్రిల్‌కి వాయిదా
- ఊపిరిపీల్చుకున్న అమరావతి రైతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అమరావతి రాజధాని కేసు విచారణను సుప్రీంకోర్టు ఏప్రిల్‌కు వాయిదా వేయడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. ప్రస్తుతానికి వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానుల బెడద, విశాఖకు సీఎం క్యాంపు కార్యాలయం తరలింపు ప్రక్రియ ఆగినట్లేనని అధికార పార్టీ నేతలు, అధికారులు పేర్కొంటున్నారు. త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కూడా విశాఖకు తరలివెళ్లే సాహసం చేసే అవకాశం లేదు. మొత్తానికి వైసీపీ ప్రభుత్వానికి మూడు రాజధానుల నిర్ణయం నినాదానికే పరిమితమయ్యే పరిస్థితి ఏర్పడింది. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు కాగానే అమరావతి రాజధాని పనులు అర్ధాంతరంగా నిలిపివేసిన సీఎం జగన్... 2019 డిసెంబర్‌లో రాష్ట్ర సమగ్రాభివృద్ధి పేరుతో మూడు రాజధానుల వివాదాన్ని తెరపైకి తెచ్చారు.

అసెంబ్లీలో బిల్లు పెట్టి ఆమోదించారు. ఆ రోజు నుంచి రాజధాని నిర్మాణానికి ఉచితంగా భూములిచ్చిన రైతులు రోడ్డెక్కారు. మరోపక్క కోర్టులను ఆశ్రయించారు. ఇప్పటికీ వారి భౌతిక, న్యాయ పోరాటాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఇక సీఎం జగన్ పరిపాలనా రాజధానిగా ప్రకటించిన విశాఖపట్నానికి తరలివెళ్లేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. మూడు రాజధానుల నిర్ణయం చెల్లదని, రైతులతో గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం అమరావతి రాజధానిని అభివృద్ధి చేయాలని హైకోర్టు 2022 మార్చి 3వ తేదీన స్పష్టమైన తీర్పు ఇచ్చింది. దీనిపై వెనకడుగు వేసిన రాష్ట్ర ప్రభుత్వం... అప్పీలుకు గడువు ముగిసే సమయంలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

కేంద్ర ప్రభుత్వంతో తొలినుంచి సత్సంబంధాలు కొనసాగిస్తున్న సీఎం జగన్...విశాఖ తరలివెళ్లేందుకు ప్రధాని మోదీ సహకరిస్తారని భావించారు. కానీ చట్టపరంగా అవకాశం లేకపోవడంతో కేంద్రం చేతులెత్తేసింది. దీంతో వచ్చే సాధారణ ఎన్నికల్లోపు ఎలాగైనా విశాఖకు తరలివెళ్లి...తమ పంతం నెగ్గించుకోవాలని వైసీపీ ప్రభుత్వం మరో ప్రయత్నం చేసింది. ఉత్తరాంధ్ర అభివృద్ధి పేరుతో తరచూ సమీక్షలు నిర్వహించాల్సి ఉంటుందనే నెపంతో, సీఎం క్యాంపు కార్యాలయం, మరికొన్ని ముఖ్యమైన ప్రభుత్వ శాఖల కార్యాలయాలు తరలించేందుకు ప్రణాళిక రచించారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో ఎక్కడ నుంచైనా సమీక్షలు నిర్వహించే వెసులుబాటు ఉన్నందున, ఆ కారణంతో విశాఖకు వెళ్లాలని ప్లాన్ చేశారు. ఇందుకోసం విశాఖలో కార్యాలయాల ఏర్పాటుకు భవనాలను కూడా గుర్తించారు. ఈ ఏడాది దసరా నుంచి విశాఖకు తరలివెళ్లేందుకు గట్టి ప్రయత్నమే చేశారు.

కానీ రైతులు మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో తరలింపు ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది. ఈలోగా హైకోర్టు సింగిల్ జడ్జి కార్యాలయాల తరలింపు ప్రక్రియను ఆపాలని ఆదేశించడంతో వైసీపీ సర్కార్‌కు మరలా ఎదురుదెబ్బ తగిలింది. ఇక సుప్రీంపై చివరి ఆశలు పెట్టుకోగా, అక్కడ కూడా కేసు విచారణ ఏకంగా ఏప్రిల్ నెలకు వాయిదా పడింది. దీంతో వైసీపీ ప్రభుత్వ మూడు రాజధానుల కల కలగానే మిగిలిపోయే పరిస్థితి ఏర్పడింది. ఈలోగా సాధారణ ఎన్నికలు ముగియనున్నాయి. ఈసారి మూడు రాజధానుల పేరుతో వైసీపీ...అమరావతి రాజధాని పేరుతో టీడీపీ, మిగిలిన రాజకీయపక్షాలు ప్రజల తీర్పు కోరనున్నాయి. వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడితే ఇక మూడు రాజధానులు శాశ్వతంగా అటకెక్కినట్టే.

హస్తం గూటికి షర్మిల

- కాంగ్రెస్‌లో వైఎస్ఆర్టీపీ విలీనం
- ఏఐసీసీ పెద్దల సమక్షంలో చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన ఖర్గే, రాహుల్
- సోనియాగాంధీతో భేటీ- అనేక అంశాలపై చర్చ

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ఆవిర్భవించిన వైఎస్ఆర్టీపీ... కాంగ్రెస్‌లో విలీనమైంది. మాజీ ముఖ్యమంత్రి డా. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె, ఆంధ్రప్రదేశ్ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చెల్లెలైన వైఎస్ షర్మిల ఈ పార్టీని స్థాపించారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆమె తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తారన్న ప్రచారం హోరెత్తింది. ఈ ప్రచారానికి తెరదించుతూ తన పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేశారు షర్మిల. అనంతరం హస్తం పార్టీ కండువా కప్పుకున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో పార్టీలో చేరారు. రాహుల్ ఆమెకు పార్టీ కండువాను కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. అనంతరం ఏఐసీసీ అధినేత్రి సోనియాగాంధీతో షర్మిల భేటీ అయ్యారు. అనేక అంశాలపై చర్చించారు.

తెలంగాణలో పార్టీని స్థాపించిన తరువాత కాంగ్రెస్ పార్టీని ఆమె లక్ష్యంగా చేసుకున్నారు. దీంతో ఆమె బీఆర్ఎస్‌కు అనకూలమన్న వద్దంతులు వచ్చాయి. కానీ తెలంగాణలో నిరుద్యోగంపై రాష్ట్రవ్యాప్త అందోళనకు శ్రీకారం చుట్టడం ద్వారా ఆ వద్దంతులకు ఆమె చెక్ పెట్టారు. వైఎస్ఆర్టీపీ బలోపేతానికి పాదయాత్రను కూడా చేశారు. ఖమ్మం జిల్లా పాలేరు నుంచి షర్మిల పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ కూడా వైఎస్ఆర్టీపీ పార్టీకి మద్దతివ్వాలని వైఎస్ఆర్ అభిమానులకు పిలుపునిచ్చారు. షర్మిల వెంట అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీపై షర్మిల తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఓ దశలో షర్మిల పార్టీలోకి కాంగ్రెస్ కీలక నాయకులు వస్తారన్న ప్రచారం రాష్ట్రంలో జోరందుకుంది. అలాగే అనేక జిల్లాల నేతలు వైఎస్ఆర్టీపీ నుంచి పోటీ చేయాలనే సంకల్పంతో క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశారు. ఓవైపు సార్వత్రిక ఎన్నికల సమయానికి కాంగ్రెస్ పెద్దల నుంచి ఒత్తిడి పెరిగింది. మరోవైపు వైఎస్ఆర్‌కు మిత్రుడైన కేవీపీ, కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ అనేకమార్లు షర్మిలతో భేటీ అయ్యారు. తెలంగాణలో కాంగ్రెస్‌కు గెలిచే అవకాశాలు ఉన్నందున మీరు పోటీ చేస్తే ఓట్లు చీలిపోవచ్చని, అది బీఆర్ఎస్‌కు కలిసివస్తుందని షర్మిలకు వారు నచ్చచెప్పారు. దీంతో తమ పార్టీ పోటీ చేయదని, కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తుందని షర్మిల ప్రకటించారు. ఫలితంగా పార్టీలో అసంతృప్తి మొదలైంది. పార్టీ శ్రేణులంతా బీఆర్ఎస్‌లో చేరారు. కాగా, పార్టీ వీలీన ప్రక్రియపై పార్టీ నేతలకు షర్మిల బుధవారం వివరించారు. వైఎస్ఆర్టీపీని గురువారం కాంగ్రెస్‌లో వీలీనం చేశారు. దీంతో ఆమెకు ఏ పదవి ఇస్తారనే విషయం చర్చనీయాంశంగా మారింది. అన్న జగన్‌మోహన్‌రెడ్డి పైకి బాణంలా షర్మిలను కాంగ్రెస్ వదులుతుందా లేక తెలంగాణకే పరిమితం చేస్తుందా అన్న చర్చ ప్రారంభమైంది. ఏదేమైనా ఆమె కాంగ్రెస్‌లో చేరడంపై హస్తం పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు.

వైఎస్ఆర్ ఆశయసాధనకు కృషిచేస్తా: షర్మిల

కాంగ్రెస్ పార్టీలో గప్పనేతగా గుర్తింపు పొందడంతో పాటు పార్టీ బలోపేతానికి

- మిగతా 2 లో

బీసీలకు వైసీపీ ద్రోహం

- కార్పొరేషన్‌లను ఉత్సవ విగ్రహాల్లా మార్చారు
- జీఎస్డీపీని మించి రాష్ట్రంలో అప్పులు
- పన్నుల రూపంలో రక్తం తాగుతున్న జగన్
- జయహో బీసీ ప్రచార రథాలు ప్రారంభించిన చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : అధికారంలోకి రావడానికి నోటికొచ్చిన వాగ్దానమల్లా చేసిన వైసీపీ ప్రభుత్వం బీసీలకు తీరని ద్రోహం చేసిందని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన జయహో బీసీ కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొని బీసీ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'పన్నుల రూపంలో జగన్ బలహీన వర్గాల రక్తం తాగుతున్నాడు. జీఎస్డీపీని మించి రూ.13 లక్షల కోట్ల అప్పులు చేశాడు. ఈ అప్పులు జగన్ తీరుస్తాడా? జనాభాలో 50 శాతం బలహీన వర్గాలే ఉన్నందున రూ.6.5 లక్షల కోట్లు బీసీలే కట్టాలి. బీసీలకు న్యాయం చేయకపోవడమే కాకుండా చేసిన అప్పులో 50 శాతం బీసీల నెత్తిన పెట్టాడని చంద్రబాబు ధ్వజమెత్తారు. నాకు

- మిగతా 2 లో

ఐకమత్యమే మన బలం

- కలిసికట్టుగానే ఎన్నికల్లో గెలవగలం
- ఎన్డీయే అబద్ధాలు, మోసాలు బట్టబయలు చేయగలం
- అహర్నిశలు శ్రమిస్తేనే ప్రత్యామ్నాయంగా నిలవగలం
- న్యాయ యాత్రను విజయవంతం చేయగలం
- పార్టీ శ్రేణులతో ఖడ్గే - ఎన్నికల వ్యూహాలపై ముఖ్యనేతలతో చర్చ

న్యూదిల్లీ: కలిసి కట్టుగా ముందుకెళితేనే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని, ఐకమత్యమే మనకు బలమని పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే అన్నారు. మనస్పర్థలను మర్చి ఎన్నికల్లో గెలుపు కోసం అహర్నిశలు పాటుపడాలని సూచించారు. మాజీ అధినేత్రి సోనియాగాంధీ ప్రతి రాష్ట్రంలో పడిన కష్టం వల్లనే 2004లో యూపీఏ అధికారంలోకి రాగలిగిందని, అప్పట్లో గ్రామీణ స్థాయి నుంచి పట్టణాల వరకు కేడర్ ఆమె వెంట నడిచినట్లు గుర్తుచేశారు. ఇప్పుడు కూడా అంతే నిబద్ధతతో పనిచేసి పార్టీని విజయపథంలో నడిపిద్దామని నాయకులు, కార్యకర్తలకు ఖడ్గే పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఐక్యంగా ముందుకెళదామని, ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అందిద్దామని ఉద్ఘాటించారు. పార్టీ బలహీనంగా ఉన్న స్థానాలను గుర్తించి, పట్టు సాధించేందుకు కసరత్తు ఇప్పటికే జరుగుతోందని తెలిపారు. ఈనెల 14 నుంచి జరగబోయే భారత్ న్యాయ యాత్ర కోసం సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించేందుకు నడుం బిగించిన కాంగ్రెస్ పార్టీ గురువారం దిల్లీలోని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో పార్టీ ముఖ్యనేతలతో సమావేశమైంది. అధికారమే అజెండాగా ఖడ్గే అధ్యక్షతన ఈ సమావేశం మూడు గంటలకుపైగా జరిగింది. అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీలు, రాష్ట్రాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. ఎన్నికల వ్యూహాలు, భారత్ న్యాయ యాత్ర, ఇండియా కూటమితో సీట్ల సర్దుబాటుపై చర్చించారు. తమకున్న గెలుపు అవకాశాలను, పార్టీ బలోపేతానికి చర్యల గురించి సమాలోచనలు జరిపారు. భారత్ జోడోకు కొనసాగింపుగా జనవరి 14 నుంచి మార్చి 20 వరకు జరగబోయే భారత్ న్యాయ యాత్ర కార్యాచరణపైనా నాయకులు చర్చించారు. ఖడ్గే మాట్లాడుతూ బీజేపీ చెప్పే అబద్ధాలకు, చేసే మోసాలకు దీటైన బదులు

- మిగతా 2 లో

రేపు దిల్లీలో ఈవీఎంల వ్యతిరేక ఆందోళన

న్యూదిల్లీ: 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎం) హటావో, లోక్‌తంత్రకు బచావో, బ్యాలెట్ పేపర్ లావో' నినాదాలతో దిల్లీ జంతర్ మంతర్ మారుమోగబోతోంది. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్ల వినియోగాన్ని అరికట్టాలని, బ్యాలెట్ పేపర్లను వినియోగించాలన్న డిమాండ్‌తో శుక్రవారం మెగా ర్యాలీ జరగనుంది. దేశ నలుమూలల నుంచి అన్ని వర్గాల వారు జంతర్ మంతర్‌కు చేరుకొని ఆందోళనలో పాల్గొంటారు. ప్రజాస్వామ్య విలువుల పరిరక్షణకు పిలుపునిస్తారు. ఈ ఆందోళనకు సుప్రీంకోర్టు న్యాయవాది భాను ప్రతాప్ సింగ్, దిల్లీకి చెందిన సామాజిక కార్యకర్త హిజమ్ రాజెన్ నాయకత్వం వహిస్తారు. ఎన్నికల సంస్కరణల తక్షణావశ్యతను తెలియజేయడమే కాకుండా బ్యాలెట్ పేపర్లను మళ్లీ వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాస్వామ్య విధానంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించవచ్చన్న గళాన్ని బిగ్గరగా వినిపించనున్నారు. 20 లక్షల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నా అరెస్టుకు బీజేపీ కుట్ర

- నా శ్వాస, నా ప్రతి రక్తపు బొట్టు దేశానికి అంకితం
- ఈడీ తాజా సమన్లపై దిల్లీ సీఎం కేజ్రీవాల్

2లో

68 ఖాళీలు

- త్వరలో రాజ్యసభ సభ్యుల పదవీ కాలం పూర్తి
- అందులో 9 మంది కేంద్రమంత్రులు
- దిల్లీలో మూడు, సిక్కింలో ఒక స్థానానికి ఎన్నికల ప్రకటన

న్యూదిల్లీ: ఈ ఏడాది రాజ్యసభలో 68 ఖాళీలు ఏర్పడనున్నాయి. తొమ్మిది మంది కేంద్రమంత్రులతో సహా 68 మంది రాజ్యసభ సభ్యులు 2024లో పదవీ విరమణ పొందనున్నారు. దీంతో ఎగువసభలో స్థానం కోసం ఇప్పటికే పోటీ మొదలైంది. నలుగురు నామినేటెడ్ సభ్యులు జులైలో పదవీ విరమణ పొందుతారు. ఆప్ నేతలు సంజయ్ సింగ్, నరేన్ దాస్ గుప్తా, సుశీల్ కుమార్ గుప్తా

- మిగతా 2 లో

కేసీఆర్‌ను పరామర్శించిన జగన్

లోటస్‌పాండ్‌లో తల్లి విజయమ్మను కలిసిన సీఎం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలంగాణ మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుర్తి చంద్రశేఖరరావు(కేసీఆర్)ను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం పరామర్శించారు. సీఎం జగన్ గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు జగన్‌కు ఘనస్వాగతం పలికారు. అనంతరం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని నందినగర్‌లో గల కేసీఆర్ ఇంటికి జగన్ వెళ్లారు. అక్కడ జగన్‌కు బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి కేటీఆర్, మాజీ హోంమంత్రి మహమూద్ అలీ, ఆ పార్టీ ఎమ్మెల్యేలు స్వాగతం పలికి ఆహ్వానించారు. జగన్ గంటకు పైగా కేసీఆర్‌తో కలిసి ఉన్నారు. ఇటీవల కాలి తుంటి శస్త్రచికిత్స చేసుకున్న కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిని జగన్ అడిగి తెలుసుకున్నారు. వారిద్దరి మధ్య రాజకీయపరమైన చర్చలు కూడా జరిగినట్లు సమాచారం. జగన్ వెంట

- మిగతా 2 లో

ఈజిప్టు సహా ఐదు దేశాలకు బ్రిక్స్ సభ్యత్వం

త్వరలో కొన్ని లాటిన్ అమెరికా దేశాలకు కూడా: రష్యా

మాస్కో: ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు బ్రిక్స్ సభ్యత్వం లభించింది. జనవరి ఒకటో తేదీ నుంచి ఐదు దేశాలు బ్రిక్స్ సభ్యదేశాలైనట్లు బ్రిక్స్ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించే సందర్భంగా రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ మేరకు ప్రకటన చేశారు. బహుళపాక్షికవాదాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ప్రతిజ్ఞ చేశారు. అంతర్జాతీయ అభివృద్ధి, భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని, శాస్త్రీయ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందిస్తామని, ఆరోగ్య రంగానికి, పర్యావరణ పరిరక్షణకు, సంస్కృతికి, క్రీడలకు, యువత, పౌర సమాజానికి తోడ్పాటు అందిస్తామన్నారు. కొత్త సభ్యదేశాల చేరికతో ప్రపంచ మొత్తం జనాభాలో 40శాతానికి బ్రిక్స్ ప్రాతినిధ్యం వహిస్తోంది. అలాగే అంతర్జాతీయ జీడీపీలో 36శాతం భాగస్వామ్యాన్ని కలిగివున్నాయి. ఇది జీ7 దేశాలన్నింటికంటే ఎక్కువ. కాగా, మొత్తం 30కుపైగా దేశాలు బ్రిక్స్ సభ్యత్వాన్ని కోరుకోగా ఈ ఏడాది అక్టోబరులో జరిగే సదస్సు నాటికి లాటిన్ అమెరికా దేశాల్లో కొన్నింటికి సభ్యత్వం కల్పించే అవకాశాలు ఉన్నట్లు రష్యా వెల్లడించింది.

లెబనాన్‌ను వీడండి

తమ పౌరులకు జర్మనీ, కెనడా, స్వీడన్ ఆదేశాలు

బెర్లిన్: ఇజ్రాయిల్, హమాస్ మధ్య పోరు మరింత భీకరంగా మారుతుండటం, లెబనాన్‌పైనా ఇజ్రాయిల్ దాడులతో వెంటనే అక్కడ నుంచి తరలిపోవాలని తమ పౌరుకుల అనేక దేశాలు ఆదేశాలు జారీచేశాయి. జర్మనీ పౌరులు 'ఎలిఫాంట్' జాబితాలో నమోదు చేసుకోవాలని ఆ దేశ విదేశాంగ శాఖ సూచించింది. కెనడా, స్వీడన్‌తో పాటు అమెరికా మిత్రదేశాలు కొన్ని కూడా తమ పౌరులను సాధ్యమైనంత త్వరగా లెబనాన్ దేశాన్ని వీడటం మంచిదని సూచించాయి. హమాస్ అంతమే లక్ష్యమని ప్రకటించిన ఇజ్రాయిల్... లెబనాన్ రాజధాని బీరుట్‌లో డ్రోన్ దాడి జరిపి కీలక కమాండర్ అరౌరీని హతమార్చింది. అరౌరీ మృతికి బదులు తీర్చుకుంటామని హెజ్బొల్లా ప్రకటించగా బందీలు, కాల్పుల విరమణ కోసం చర్చలను హమాస్ నిలిపివేసింది.

నేటితో ముగియనున్న అమెరికా, ద.కొరియా విన్యాసాలు

సియోల్: ఉత్తర కొరియా సరిహద్దు వద్ద దక్షిణ కొరియా, అమెరికా సంయుక్తంగా సైనిక విన్యాసాలు శుక్రవారానికి ముగియనున్నాయి.

ప్యాంగ్యాంగ్‌తో పొంచివున్న ముప్పు నేపథ్యంలో యుద్ధ సన్నద్ధతను ఈ విన్యాసాల ద్వారా ప్రదర్శించినట్లు దక్షిణ కొరియా సైన్యం గురువారం తెలిపింది. పోచియన్ నగరంలో డిసెంబరు 29న మొదలైన విన్యాసాలు శుక్రవారం (5వ తేదీ)తో ముగియనున్నాయి. కే1ఏ2 ట్యాంకులు, ఏ19 యుద్ధ విమానాలు, స్ట్రైకర్ సాయుధ సిబ్బంది కేరియర్లు, ఆర్టిలరీ వ్యవస్థలతో సహా 110 ఆయుధ వ్యవస్థలు విన్యాశాల్లో పాల్గొన్నాయని యోన్హప్ వార్తాసంస్థ నివేదించింది. వైమానిక దాడులు, ట్యాంకులు, వైమానిక రక్షణ విన్యాసాలు నిర్వహించినట్లు వెల్లడించింది. ఈ వారం మొదట్లో అనేక విన్యాసాలను శిక్షణలో భాగంగా ప్రదర్శించింది.

ఇరాన్ పేలుళ్లలో 103 మంది మృతి

టెహ్రాన్: ఇరాన్ జనరల్ ఖాసీం సులేమానీ నాల్గో జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రెండు పేలుళ్లు జరిగాయి. 103 మంది మృత్యువాత పడగా మరో 188 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన కెర్మన్ నగరంలో జరిగింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. దాడికి ఏ సంఘం బాధ్యత వహించలేదు. అయితే ఇది ఉగ్రదాడి అని ఇరాన్ అధికారులు భావిస్తున్నారు. జుడీషియరీ చీఫ్ గులాం హుస్సేన్ మొహ్‌సేనీ ఈజెయి స్పందిస్తూ సులేమానీపై కక్ష పెంచుకున్న వారి పనిగా పేర్కొన్నారు. పేలుళ్లను ఆయాతుల్లా సయ్యద్ అలీ ఖమేనీ ఖండించారు. మృతులకు సంతాపం ప్రకటించారు. దాడికి పాల్పడిన వారికి దీటైన బదులిస్తామని ఆయన ఓ ప్రకటన చేశారు. కాగా సులేమానీ 2020 జనవరి 3న అమెరికాలో హత్యకు గురయ్యారు.

కేసీఆర్‌ను పరామర్శించిన జగన్

(మొదటిపేజీ తరువాయి)

ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సీఎం కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ తలశిల రఘురామ్, అధికారులు ఉన్నారు. కేసీఆర్‌తో భేటీ అనంతరం సీఎం జగన్ హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్‌లోని తన నివాసానికి వెళ్లారు. దాదాపు రెండేళ్ల తర్వాత సీఎం తన ఇంటికి వెళ్లారు. అక్కడ తల్లి విజయమ్మను కలిశారు. ఆమెతో కలిసి భోజనం చేశారు. షర్మిల కాంగ్రెస్‌లో చేరిన సందర్భంగా విజయమ్మను సీఎం కలవడం చర్చనీయాంశంగా మారింది. అనంతరం జగన్ తిరిగి తాడేపల్లి చేరుకున్నారు.

సీసీవీకి యూరోపియన్ కమ్యూనిస్టుల సంఘీభావం

కారకస్: ప్రస్తుతం పీఎస్‌యూవీ పాలనలో తీవ్రస్థాయిలో దాడులను ఎదుర్కొంటున్న వెనిజులా కమ్యూనిస్టు పార్టీకి యూరోపియన్ కమ్యూనిస్టు యాక్షన్ సంపూర్ణ సంఘీభావం ప్రకటించింది. వెనిజులా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిన సామ్రాజ్యవాద ఆంక్షలను తక్షణమే ఎత్తివేయాలని వెనిజులా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. పార్టీ వ్యవహారాల్లో పీసీవీకి వ్యతిరేకంగా వెనిజులాలోని మదురో ప్రభుత్వ మితిమీరిన జోక్యాన్ని ఆక్షేపించింది. ఇది మానుకోవాలని హితవు పలికింది. కమ్యూనిస్టు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక చర్యలను ఆపేయాలని, కమ్యూనిస్టు-కార్మిక సంఘాల నాయకులు, రాజకీయ ఖైదీలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. పీసీవీకి న్యాయపరంగా ఉన్న గుర్తింపును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని దుయ్యబట్టింది. పీసీవీకి సమర్థన తెలుపడం ద్వారా శ్రామిక వర్గ హక్కులను సమర్థించినవారమవుతామని వెనిజులా ప్రజలకు పిలుపునిచ్చింది.



రేపు దిల్లీలో ఈవీఎంల వ్యతిరేక ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ఈవీఎంలు గల్లంతైతే ఎన్నికల సంఘం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడానికి నిరసనగా ఈ ఆందోళన నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 'అనేకమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. గల్లంతైన ఓటింగ్ యంత్రాల కోసం దర్యాప్తు జరిపించలేదు. కుట్రపూరిత మౌనంతో ఎన్నికల ప్రక్రియపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు' అని అన్నారు. భాను ప్రతాప్ సింగ్ స్పందిస్తూ 'ఈవీఎంలను హాక్-ప్రభావితం చేయొచ్చు. దాంతో ప్రజాస్వామ్య ప్రాథమిక సిద్ధాంతాలకు ముప్పు ఏర్పడుతుంది. ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు స్పందించడం, పారదర్శకంగా వ్యవహరించడం కీలకం. అప్పుడే ఎన్నికల ప్రక్రియను నమ్మే పరిస్థితి ఉంటుంది.' అని అన్నారు. హిజమ్ రాజన్ మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో ఈవీఎంలు గల్లంతు కావడాన్ని నిర్లక్ష్యం చేయలేమన్నారు. దీనిపై సమాధానాల కోసం ప్రజలు డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం తీరును ఖండించారు. ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్లను వాడాలని డిమాండ్ చేశారు. అది జరిగినప్పుడే ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతకు హామీ లభిస్తుందని అన్నారు. శనివారం జరగబోయే ర్యాలీని జయప్రదం చేయాలని, స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికల కోసం ప్రాంతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు ర్యాలీలో పాల్గొనాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

నా అరెస్టుకు బీజేపీ కుట్ర

న్యూదిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల ప్రచారం నుంచి తనను ఆపేందుకు బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తనను అరెస్టు చేయాలని చూస్తోందని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ గురువారం ఆరోపించారు. ఇక్కడ విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ తన ప్రతిష్ఠను దెబ్బతీయాలని చూస్తోందన్నారు. 'ఈడీ సమన్లు చట్టవిరుద్ధమని నా న్యాయవాదులు నాకు చెప్పారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం నుంచి నన్ను ఆపేందుకు బీజేపీ నన్ను అరెస్టు చేయాలని చూస్తోంది' అని ఆయన ఆరోపించారు. బుధవారం దిల్లీ మద్యం పాలసీ కేసులో మూడోసారి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు గైర్హాజరైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ తాజాగా తనకు సమన్లు జారీ చేయడంపై ఘాటుగా స్పందించారు. గత రెండేళ్లుగా దర్యాప్తు చేస్తున్న మద్యం కుంభకోణం కేసు నకిలీదని, అవినీతికి సంబంధించిన ఆధారాలను దర్యాప్తు సంస్థలు ఇప్పటి వరకు సమర్పించలేదని కేజ్రీవాల్ అన్నారు. 'నా పెద్ద ఆస్తి నా నిజాయితీ. నకిలీ కేసులతో నా నిజాయితీని దెబ్బతీయాలని బీజేపీ కోరుకుంటోంది. నేను ఎప్పుడూ దేశం కోసం పోరాడాను. నా ప్రతి శ్వాస, నా ప్రతి రక్తపు బొట్టును దేశానికి అంకితం చేస్తున్నాను' అని కేజ్రీవాల్ నొక్కి చెప్పారు. ఈ సంక్షోభ సమయంలో తనకు మద్దతు ఇవ్వాలని ఆప్ జాతీయ కన్వీనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'నిజాయితీగల నేతలను జైల్లో పెట్టి, అవినీతిపరులను తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా దేశం ముందుకు సాగదు. ఏం జరుగుతోంది? ఏది జరిగినా అది చాలా ప్రమాదకరం. ఇది మన ప్రజాస్వామ్యానికి చాలా చెడ్డది. దీనిని ఆపాలి' అని ఆయన అన్నారు. వారి సమన్లు చట్టవిరుద్ధమైనవని ఈడీకి లేఖ రాశాను. కానీ ఎలాంటి ప్రతిస్పందన రాలేదని తెలిపారు. 'సమన్లు చట్టవిరుద్ధమని తెలిసినందున వారు సమాధానం ఇవ్వలేదు. నేను అక్రమ సమన్లను అనుసరించాలా? చట్టబద్ధంగా సమన్లు జారీ చేస్తే నేను వాటిని అనుసరిస్తాను. నా గొప్ప సంపద నా నిజాయితీ. నా ప్రతిష్ఠను దిగజార్చడం ద్వారా వారు నన్ను విచ్ఛిన్నం చేయాలనుకుంటున్నారు' అని అన్నారు. ఎనిమిది నెలల క్రితం కేంద్ర దర్యాప్తు సంస్థ తనను పిలిచినప్పుడు తాను ఏజెన్సీ ముందు హాజరయ్యానని కేజ్రీవాల్ చెప్పారు. 'లోక్‌సభ ఎన్నికలకు ముందు నన్ను ఎందుకు పిలుస్తున్నారు? బీజేపీ నన్ను విచారించాలని కోరుకోవడం లేదు. కానీ ఈడీతో అరెస్టు చేయించాలని కోరుకుంటోంది' అని అన్నారు. మద్యం పాలసీ కుంభకోణం ఆరోపిస్తున్నట్లుగా లేదని జైలులో ఉన్న ఆప్ నేతలెవరిపైనా ఆధారాలు లేవని ముఖ్యమంత్రి నొక్కి చెప్పారు. 'మనీశ్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్ అవినీతికి పాల్పడి జైలులో లేరని, బీజేపీలో చేరనందునే... అవినీతికి పాల్పడనందునే వారిపై పోరాడగలుగుతున్నాము' అని అన్నారు. ఈ కుంభకోణానికి సంబంధించి రెండేళ్లుగా దర్యాప్తు సంస్థలు అనేక మందిపై దాడులు చేసి అరెస్టులు చేసినా ఎక్కడా ఒక్క పైసా కూడా దొరకలేదని ముఖ్యమంత్రి అన్నారు. 'అవినీతి నిజంగా జరిగితే ఆ కోట్ల రూపాయలన్నీ ఎక్కడికి పోయాయి? డబ్బు అంతా గాలిలో మాయమైందా? నిజమేమిటంటే ఎలాంటి అవినీతి జరగలేదు. అలా జరిగి ఉంటే డబ్బు కూడా వచ్చి ఉండేది' అని అన్నారు. తమ పార్టీ నేతలు ఏదైనా అక్రమాలకు పాల్పడి ఉంటే ఇతర అవినీతి నాయకుల మాదిరిగానే వారు కూడా కాషాయ దళంలో చేరి ఉండేవారని ఆయన అన్నారు. కాగా, గుజరాత్‌లో శనివారం నుంచి మూడు రోజుల ఎన్నికల ప్రచారాన్ని కేజ్రీవాల్ ప్రకటించారు. సంబంధిత పరిణామంతో దిల్లీ ముఖ్యమంత్రిపై దాడి చేసి అరెస్టు చేసేందుకు ఈడీ 'సన్నద్ధమవుతుందని ఆప్ నాయకులు పేర్కొన్న తర్వాత బుధవారం ఇక్కడ కేజ్రీవాల్ నివాసానికి వెళ్లే రహదారులను దిగ్బంధించి, అన్ని గేట్ల వద్ద పోలీసు సిబ్బందిని మోహరించి, ముఖ్యమంత్రి ఇంటి చుట్టూ భద్రతను పెంచినట్లు దిల్లీ పోలీసులు తెలిపారు. ఈడీ నాల్గవ సారి కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేసింది. అయితే, రాజ్యసభ ఎన్నికలు, గణతంత్ర దినోత్సవ సన్నాహాలు, దర్యాప్తు సంస్థ 'బహిర్గతం చేయని, ప్రతిస్పందన లేని విధానం' దాని ముందు హాజరుకాకపోవడానికి కారణాలుగా ఈడీకి పంపిన లేఖలో కేజ్రీవాల్ పేర్కొన్నారు. దీంతో బుధవారం కేసు దర్యాప్తు అధికారికి కేజ్రీవాల్ పంపిన ఐదు పేజీల ప్రత్యుత్తరాన్ని ఈడీ ప్రస్తుతం పరిశీలిస్తోందని, సమన్లు చట్టవిరుద్ధమన్న ఆయన ఆరోపణలను తిరస్కరించవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) నిబంధనల ప్రకారం ఈడీ కేజ్రీవాల్‌కు నాల్గవ సమన్లు జారీ చేయవచ్చని వివరించాయి.

చట్టప్రకారం సమన్లు పంపితే కేజ్రీవాల్ సహకరిస్తారు : ఆప్

దిల్లీ మద్యం కుంభకోణం బూటకమని, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు ఈడీ 'చట్టపరమైన' సమన్లు పంపితే దానికి సహకరిస్తానని ఆప్ నేతలు చెప్పారు. మద్యం కుంభకోణంపై రెండేళ్లుగా దర్యాప్తు జరుగుతోందని, ఈడీ 500 మందికి పైగా సాక్షులను పిలిచి 1,000 మందికి పైగా దాడులు నిర్వహించిందని, అయితే ఇప్పటివరకు ఈడీ ఆధారాలుగా ఎటువంటిది రికవరీ చేయలేదని ఆప్ నేత జాస్మిన్ షా అన్నారు. 'ఇండియా' కూటమికి చెందిన అగ్ర నేతలను లక్ష్యంగా చేసుకుని లోక్‌సభ ఎన్నికలకు ముందు కేజ్రీవాల్‌ను ప్రచారం చేయకుండా అరెస్టు చేయడం కుట్ర అని అన్నారు.

ఆప్ జాతీయ అధికార ప్రతినిధి ప్రియాంక కక్కర్ మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన నాయకులను ఎలాంటి ఆధారాలు లేకుండా ఒకరి తర్వాత మరొకరు జైలులో పెట్టారని, అయితే వారు ఎప్పుడూ క్లీన్‌గా బయటకు వస్తున్నారని అన్నారు. కేజ్రీవాల్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ఆప్ నాయకుడు అతిషి మాట్లాడుతూ రెండు సంవత్సరాలుగా దర్యాప్తు చేసినప్పటికీ తమ వద్ద ఎటువంటి ఆధారాలు లేనందున దర్యాప్తు సంస్థలు ఆరోపించిన మద్యం కుంభకోణంలో ఎటువంటి ఆధారాలు సమర్పించలేకపోయాయని లేదా విచారణ ప్రారంభించలేదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నేతలపై పీఎంఎల్ఏను ప్రయోగించడం బీజేపీ ఒక ప్రామాణిక విధానంగా ఉందని ఆమె ఆరోపించారు. ఎందుకంటే అలాంటి కేసుల్లో బెయిల్ పొందడం దాదాపు అసాధ్యమని, ఆరోపించిన మద్యం కుంభకోణం 'రాజకీయ కుట్ర' తప్ప మరొకటి కాదని అతిషి ఆరోపించారు.

హస్తం గూటికి షర్మిల

(మొదటిపేజీ తరువాయి)

తన తండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అహర్నిశలు కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు తన వంతు కృషి చేస్తానని షర్మిల తెలిపారు. పార్టీ విలీనం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద లౌకిక పార్టీ కాంగ్రెస్ అని, అన్ని వర్గాలకు న్యాయం చేయగలదని, అందరినీ కలుపుతూ ముందుకు వెళుతుందని ఆమె అన్నారు. మణిపూర్‌లో చర్చీలు కూల్చివేయడం బాధించిందని, లౌకిక పార్టీ అధికారంలో లేకపోతే ఏం జరుగుతుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో కేసీఆర్ వ్యతిరేక ఓటు చీలకూడదనే కాంగ్రెస్‌కు మద్దతిచ్చినట్లు తెలిపారు. భారత్ జోడో యాత్రతో దేశ ప్రజలందరిలో ఓ నమ్మకాన్ని రాహుల్ గాంధీ పెంచారన్నారు. రాహుల్‌ని ప్రధానిగా చూడాలన్న తన తండ్రి కల సాకారానికి కృషి చేస్తానన్నారు. ఏ బాధ్యతలు ఇచ్చినా నిబద్ధతో పనిచేస్తానని, పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని షర్మిల తెలిపారు.

68 ఖాళీలు

(మొదటిపేజీ తరువాయి)

పదవీ కాలం ఈనెల 27వ తేదీతో పూర్తి కానున్నది. దీంతో వారి స్థానాలకు ఎన్నికలు ప్రకటించారు. అలాగే సిక్కిం స్థానానికి ఎన్నికలు ప్రకటించారు. ఎస్డీఎఫ్ నేత హిషే లాచుంగ్‌పా రాజ్యసభ పదవీ కాలం ఫిబ్రవరి 23తో ముగియనుంది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, పర్యావరణ మంత్రి భూపేంద్ర యాదవ్, ఆరోగ్య మంత్రి మన్సుక్ మాండవియా, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఏప్రిల్‌లో రిటైర్ అవుతారు. అధికంగా ఉత్తరప్రదేశ్‌కు పది స్థానాలు ఖాళీ అవుతాయి. అలాగే మహారాష్ట్ర, బీహార్ (ఆరు చొప్పున), మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్ (చెరో ఐదు), కర్నాటక, గుజరాత్ (చెరో నాలుగు), ఒడిశా, తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్ (మూడు చొప్పున), జార్ఖండ్, రాజస్థాన్ (చెరో రెండు), ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఒక్కో స్థానం ఖాళీ కాబోతోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి టీడీపీ సభ్యుడు కనకమేడల రవీంద్ర కుమార్, బీజేపీ సభ్యుడు సీఎం రమేశ్, వైసీపీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి వెమిరెడ్డి పదవీ విరమణ పొందుతారు. హరియాణా, చత్తీస్‌గఢ్ నుంచి బీజేపీ నేతలు డీపీ వత్స్, సరోజ్ పాండే, జార్ఖండ్ నుంచి సమీర్ ఓరాగాన్ (బీజేపీ), కాంగ్రెస్ నేత ధీరజ్ ప్రసాద్ సాహు మేలో రిటైర్ అవుతారు. కేరళ నుంచి వినయ్ విశ్వం (సీపీఐ) ఎలమరం కరీం (సీపీఎం), జోసె కె. మణి (కేసీఎం) జులైలో పదవీ విరమణ పొందుతారు. జులైలో రిటైరయ్యే నామినేటెడ్ సభ్యుల్లో మహేశ్ జఠ్మలానీ, సోనల్ మాన్‌సింగ్, రామ్ షకల్, రాకేశ్ సిన్హా (బీజేపీ) ఉన్నారు. కర్నాటకలో నలుగురు, తెలంగాణలో ముగ్గురు సభ్యులు రిటైరవుతున్నారు. పదవీ విరమణ పొందే సభ్యుల్లో మన్మోహన్ సింగ్, భూపేంద్ర యాదవ్ (రాజస్థాన్), అశ్విని వైష్ణవ్, బీజేడీ నేతలు ప్రశాంత నందా, అమర్ పట్నాయక్ (ఒడిశా), బీజేపీ ప్రధాన అధికార ప్రతినిధి అనిల్ బలూని (ఉత్తరాఖండ్), మన్సుక్ మాండవియా, పురుషోత్తం రూపాలా, కాంగ్రెస్ సభ్యులు నరేన్‌భాయి రత్వా, అమీ యాగ్నిక్ (గుజరాత్), కేంద్రమంత్రి వి.మురళీధరన్, ఎంఎస్ఎంఈ మంత్రి నారాయణ్ రానే, కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్, కాంగ్రెస్ నేత కుమార్ కేట్కర్, ఎన్సీపీ సభ్యులు వందనా చవాన్, శివసేన (యూబీటీ) సభ్యుడు అనిల్ దేశాయ్ (మహారాష్ట్ర) ఉన్నారు. మధ్యప్రదేశ్ నుంచి ధర్మేంద్ర ప్రదాన్, ఎల్.మురుగన్, బీజేపీ నేతలు అజయ్ ప్రతాప్ సింగ్, కైలాశ్ సోని, కాంగ్రెస్ నేత రాజ్‌మణి పటేల్; కర్నాటక నుంచి రాజీవ్ చంద్రశేఖర్ (బీజేపీ), కాంగ్రెస్ సభ్యులు హనుమంతయ్య, జీసీ చంద్రశేఖర్, సయ్యద్ నసీర్ హుస్సేన్; తెలంగాణ నుంచి బీఆర్ఎస్ సభ్యులు జోగిని పల్లి సంతోశ్ కుమార్ రవిచంద్ర వడిరాజు, బి.లింగయ్య యాదవ్ పదవీ విరమణ పొందనున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి టీఎంసీ సభ్యులు అబీర్ రంజన్ బిశ్వాస్, సుభాశీష్ చక్రవర్తి, మహమ్మద్ నదీముల్ హక్, శాంతనూ సేన్, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ, బీహార్ నుంచి మనోజ్ కుమార్ ఝా, అహ్మద్ అష్రాఫ్ కరీం (ఆర్జేడీ), జేడీయూ సభుయలు అనీల్ ప్రసాద్ హెగ్డే, బషిస్తా నరేన్ సింగ్, బీజేపీ నేత సుశీల్ కుమార్ మోదీ, కాంగ్రెస్ సభ్యులు అఖిలేశ్ ప్రసాద్ సింగ్ పదవీ కాలం ముగియనున్నది. ఉత్తరప్రదేశ్ నుంచి బీజేపీ సభ్యులు అనిల్ అగర్వాల్, అనిల్ జైన్, అశోక్ బాజ్‌పేయి, కాంతా కర్దమ్, సకల్‌దీప్ రాజ్‌భర్, జీవీఎల్ నరసింహా రావు, విజయ్ పాల్ సింగ్ తోమర్, సుధాంశు త్రివేది, హర్‌నాథ్ సింగ్ యాదవ్, ఎస్పీ నేత జయా బచ్చన్ రిటైర్ అవుతారు.

ఐకమత్యమే మన బలం

(మొదటిపేజీ తరువాయి)

ఇవ్వాలంటే మనమంతా ఐక్యంగా ఉండాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు స్పష్టంచేశారు. ప్రజల ఎదుట మోదీ బండారాన్ని బట్టబయలు చేద్దామని, ఇందుకోసం మనస్పర్థలు, వ్యక్తిగత గొడవలను మర్చి పార్టీ కోసం పునరంకితం కావాలని కోరారు. అంతర్గత వ్యవహారాలను మీడియా ముందరకు తీసుకెళ్లవద్దని సూచించారు. కలిసికట్టుగా ఒక బృందంగా పనిచేయడం ద్వారా పార్టీ విజయపథంలో నడిపించగలమన్నారు. అదే సమయంలో బీజేపీని ఖర్గే విమర్శించారు.

పదేళ్ల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు ప్రజల మనోభావాలను రెచ్చగొట్టే పనులు చేస్తోందని దుయ్యబట్టారు.బీజేపీ చేసే ప్రతి దాడి కాంగ్రెస్, ఇండియా కూటమిపైనే అని చెప్పారు. పేరుకే అది ఎన్డీయే ... ఇండియా కూటమిలో సిద్ధాంతాలకు కట్టుబడి, క్షేత్రస్థాయిలో బలంగా ఉన్న పార్టీలున్నాయని అన్నారు. ఆధునిక భారత్ నిర్మాణంలో కాంగ్రెస్ తోడ్పాటును తోసిపుచ్చే ప్రయత్నాన్ని మోదీ ప్రభుత్వం చేస్తోందని, ఇందుకు తమ వైపు నుంచి దీటైన బదులివ్వడం అవసరమని ఖర్గే అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, ఆధునిక భారత్ పునాది వేయడానికి కాంగ్రెస్ అందించిన తోడ్పాటును మరువద్దని, చరిత్రను మరిచిపోతే చరిత్ర ఎలా సృష్టిస్తారని ప్రశ్నించారు. రేయింబవళ్లు శ్రమించడం ద్వారా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలకు ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని అందివ్వగలమన్నారు. సోనియాగాంధీ 25 ఏళ్ల సేవలను కొనియాడారు. ఆమె కష్టాఫలిగానే 2004లో ఎన్డీయేను ఓడించి యూపీఏ పదేళ్లు అధికారంలో కొనసాగిందని ఖర్గే గుర్తుచేశారు.

భారత్ న్యాయ యాత్ర కూడా విజయవంతం కాగలదని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సామాజిక న్యాయ సంబంధిత అంశాలను జాతీయస్థాయి చర్యకు కేంద్రంగా మార్చగలమన్న విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. డిసెంబరులో జరిగిన పార్టీ పునర్వ్యవస్థీకరణ తర్వాత జరిగిన తొలి సమావేశం కావడంతో దీనికి ప్రాధాన్యత ఏర్పడింది. సమావేశానికి ముందు రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గెహ్లోట్ మాట్లాడుతూ సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ కమిటీ అంతర్గతంగా రెండుసార్లు సమావేశమైందని తెలిపారు. ఈ కమిటీ తమ నివేదికను ఖర్గేకు తాజా సమావేశంలో సమర్పిస్తుందని చెప్పారు. ఇండియా కూటమి బలోపేతానికి అనుసరించే వ్యూహాలపై చర్చించేందుకు మళ్లీ సమావేశమవుతామని గెహ్లోట్ తెలిపారు.

న్యాయ యాత్ర పేరు మార్పు: జైరాం రమేశ్

భారత్ న్యాయ యాత్ర పేరును భారత్ జోడో న్యాయ యాత్రగా మార్చినట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ప్రకటించారు. యాత్రలో పాల్గొనాలని కోరుతూ ఇండియా కూటమి నాయకులు అందరికీ ఆహ్వానాలు పంపామన్నారు. అరుణాచల్ ప్రదేశ్‌తో సహా 15 రాష్ట్రాల గుండా ఈ యాత్ర సాగబోతోందని తెలిపారు. మొత్తం 6,713కిమీలు బస్సు, కాలినడకన భారత్ జోడ్ న్యాయ యాత్ర సాగుతుందన్నారు. మొత్తం 110 జిల్లాలు, 100 లోక్‌సభ స్థానాలు, 337 అసెంబ్లీ నియోజకవర్గాల్లో యాత్ర జరుగుతుందని తెలిపారు. భారత్ జోడో యాత్ర తరహాలోనే ఈ యాత్ర కూడా రాజకీయ సమీకరణలను మార్చేందుకు దోహదమవుతుందన్న విశ్వాసాన్ని జైరాం రమేశ్ వ్యక్తంచేశారు.

పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి

ఇప్పటి నుంచే కార్యాచరణ సిద్ధం చేయండి

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రానున్న సాధారణ ఎన్నికలను పటిష్ఠంగా, సక్రమంగా నిర్వహించేందుకు వీలుగా సంబంధిత శాఖలు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కెఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. రానున్న ఎన్నికల సన్నద్ధతపై గురువారం వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు సహా ఎన్నికల విధులతో నేరుగా సంబంధం ఉన్న వివిధ అధికారుల ఖాళీల భర్తీతో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం, జిల్లా ఎన్నికల అధికారుల కార్యాలయాల్లో అవసరమైన సిబ్బంది కేటాయింపు అంశాలపై సీఈఓ ముఖేశ్ కుమార్ మీనాతో సీఎస్ చర్చించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను పంపాలని స్పష్టం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల విధుల నిర్వహణతో సంబంధం ఉండి ఒకే ప్రాంతంలో మూడు, నాలుగేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న అధికారుల తప్పనిసరి బదిలీ, కొత్తవారికి పోస్టింగుల వంటి వాటిపై కూడా వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని జవహర్ రెడ్డి తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారీగా ఉండాల్సిన కనీస సౌకర్యాలపై కూడా సమీక్షించారు. రానున్న ఎన్నికల్లో డబ్బు, మద్యం అక్రమ రవాణా నియంత్రణకు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో కూడిన అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్టమైన ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. అందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. సరిహద్దు నిఘా అంశాలకు సంబంధించి ముఖ్యంగా ఏపీ, ఒడిశా రాష్ట్ర అధికారులతో త్వరలో ఒక సమన్వయ సమావేశం నిర్వహించాలని, దీనిపై ఆ రాష్ట్ర సీఎస్‌తో తాను మాట్లాడతానని చెప్పారు. రానున్న సాధారణ ఎన్నికల నిర్వహణపై ముఖ్యంగా పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, రవాణా, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, విద్యా, మున్సిపల్ తదితర శాఖలు ఇప్పటి నుంచే తగిన కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని జవహర్ రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల సన్నాహక ఏర్పాట్లపై సమీక్షకు కేంద్ర ఎన్నికల సంఘం రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల 9న రాష్ట్రానికి రానుందని తెలిపారు. 10న విజయవాడలో సీఎస్, డీజీపీ, సీఈవో సహా సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష చేయనున్నారని వివరించారు. రాష్ట్రంలో 46,165 పోలింగ్ కేంద్రాలున్నాయని, వాటిలో ఉండాల్సిన కనీస సౌకర్యాలు గురించి తీసుకోవాల్సిన అంశాలపై సీఎస్ దృష్టికి తీసుకువచ్చి వీటిపై జిల్లా ఎన్నికల అధికారులైన జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేయాల్సి ఉందని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఎం.రవిప్రకాశ్, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, రాష్ట్ర పన్నుల విభాగం ప్రధాన కమిషనర్ గిరిజా శంకర్, అదనపు పీసీసీఎఫ్ విజిలెన్స్ గోపీనాథ్, రవాణా శాఖ కమిషనర్ మనీశ్ కుమార్, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దిల్లీలో మొహల్లా క్లీనిక్‌లపై సీబీఐ దర్యాప్తు

న్యూదిల్లీ: దిల్లీలో ఆప్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొహల్లా క్లీనిక్‌లపై సీబీఐ దర్యాప్తునకు లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆదేశించారు ఆసుపత్రుల్లోని పరీక్షా కేంద్రాల్లో అవకతవకలు జరుగుతున్నాయనే ఆరోపణలతో ఆయన ఈ మేరకు నిర్ణయించినట్లు తెలిసింది. ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందించేందుకు ఏర్పాటైన మొహల్లా క్లీనిక్‌లు... రోగులు లేకపోయినా రేడియాలజీ, పాథాలజీ పరీక్షలు నిర్వహించినట్లు నకిలీ పత్రాలు సృష్టిస్తున్నాయని, వైద్యుల్లో కొందరు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారని, విధులకు హాజరైనట్లు నకిలీ పత్రాలు సమర్పిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. దీంతో సక్సేనా వీటిపై దర్యాప్తు చేపట్టాలని సీబీఐని ఆదేశించారన్నది విశ్వసనీయ సమాచారం. వైద్యుల నిర్లక్ష్య వైఖరిపై గతంలో దిల్లీ ఆరోగ్య మంత్రి సౌరభ్ భరద్వాజ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో ఏడుగురు వైద్యులపై వేటు పడింది. ఆరోగ్యశాఖ కార్యదర్శిని తొలగించే అవకాశాలున్నట్లు సమాచారం. నాసిరకం మందుల సరఫరా ఆరోపణలపై గతంలోనూ సీబీఐ దర్యాప్తునకు ఎల్జీ సక్సేనా ఆదేశించారు.

బీసీలకు వైసీపీ ద్రోహం

(మొదటిపేజీ తరువాయి)

గుర్తింపు వచ్చింది వెనకబడిన వర్గాలతోనే. నేను కష్టాల్లో అండగా నిలిచి స్ఫూర్తినిచ్చిన బీసీలను జీవితంలో మర్చిపోలేను. జగన్ పాలనలో రెడ్లు కూడా బాగుపడలేదు. కేవలం పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి, సజ్జల రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి నలుగురు మాత్రమే బాగుపడ్డారు. రైతులుగా, వ్యాపారులుగా, కాంట్రాక్టులుగా ఉన్న రెడ్లు తీవ్రంగా నష్టపోయారు. వైసీపీ ప్రభుత్వంలో లబ్ధి పొందింది జగన్ కంపెనీలు మాత్రమేనని చంద్రబాబు అన్నారు. అబద్ధాలు చెప్పడంలో జగన్ దిట్ట అని, తాను చెప్పింది ఎదుటివాళ్లు నమ్మాలనే ఉద్దేశంతోనే జగన్ కళ్లు ఆర్పుతూ అబద్ధాలు చెబుతుంటాడని తెలిపారు. పేదలను ఆర్థికంగా చిదిమేశాడు. ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బుద్ధి, జ్ఞానం లేకుండా విద్యుత్ చార్జీలు పెంచాడు. చెత్తపైన చెత్తపన్ను వేసిన చెత్త సీఎం జగన్ మాత్రమే. జగన్ పనైపోయింది. మళ్లీ గెలిచే అవకాశం లేదు. రాష్ట్ర పునర్నిర్మాణం జరగాలి. తెలుగుజాతికి పూర్వ వైభవం రావాలి. నేను అవకాశం ఇస్తాను. నాయకులుగా తయారు కావాల్సిన బాధ్యత మీది. జనాభాలో 50 శాతం బీసీలు ఉన్నారు. బీసీలకు రాజకీయ ప్రాధాన్యత, ఆర్థిక వెసులుబాటు లేదని గుర్తించి న్యాయం చేసిన నాయకుడు ఎన్టీఆర్, టీడీపీ మాత్రమే. జయహో బీసీ ద్వారా ఒక చారిత్రక కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. చరిత్ర తిరిగి రాయడానికే మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. 40 రోజుల్లో ప్రజల్లో ఉండి ఏయే కార్యక్రమాలు చేయాలో నిర్ణయించి చైతన్యం తీసుకురావాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు ఎన్టీఆర్ ప్రవేశపెడితే దాన్ని 34 శాతానికి నేను పెంచాను. వైసీపీ ప్రభుత్వం వచ్చాక 34 శాతం ఉన్న రిజర్వేషన్లు 24 శాతానికి తగ్గించింది. దీంతో 16,500 మంది పదవులు కోల్పోయారు. బీసీలకు చేయూతనిచ్చేందుకు సమైక్యాంధ్రలోనే ఆదరణ పథకం ప్రవేశపెట్టాం. 5 లక్షల మందికి బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాం. ఆ పథకాన్ని వైసీపీ పూర్తిగా రద్దు చేసింది. ఇక కార్పొరేషన్లు ఏర్పాటు చేసి కూర్చోవడానికి కుర్చీలు కూడా లేని ఉత్సవ విగ్రహాల్లా మార్చారు. ఏం ఉద్ధరించారని ఇప్పుడు సాధికార యాత్ర చేస్తున్నారని చంద్రబాబు ప్రశ్నించారు. ప్రతి ఒక్కరినీ పేదరికం నుంచి ఎందుకు తీసుకురాకూడదన్నదే పీపీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు, ప్రజల భాగస్వామ్యం) విధానం. సమర్థవంతమైన నాయకత్వం మీ ఇంటికి కూడా ఆస్తిగా మారతుంది. వంద రోజులు పార్టీ కోసం, రాష్ట్రం కోసం, వెనకబడిన వర్గాల కోసం పని చేయండి. మీమ్మల్ని ఆర్థికంగా, రాజకీయంగా పైకి తీసుకొచ్చే బాధ్యత టీడీపీ తీసుకుంటుంది. సమర్థులను పైకి తీసుకొచ్చే విధంగా నేను చూసుకుంటానని చంద్రబాబు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు, కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, పితాని సత్యనారాయణ, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, గౌతు శిరీష, శివబాల, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, బీటీ నాయుడు తదితరులు ప్రసంగించారు.

ఆప్తుల్ని కోల్పోయి.. ఆర్థికంగా చితికిపోయాం

ఏజెంట్లు ఆత్మహత్య చేసుకుంటున్నారు: ఎస్.హబీబుల్లా

కస్టమర్లకు సమాధానం చెప్పలేక ఏజెంట్లు ఆత్మహత్య చేసుకుంటున్నారు. నా సోదరి ఎస్.శంషాద్ బేగం ఒంటరి మహిళ, సీనియర్ ఏజెంట్ అయిన ఆమె 2019లో ఆత్మహత్య చేసుకున్నారు. 25 మంది జూనియర్ ఏజెంట్ల ద్వారా 500 మంది సభ్యుల నుంచి రూ.50 లక్షలు కట్టించింది. సభ్యులు ఒత్తిడి చేయటంతో సమాధానం చెప్పలేక ఒత్తిడికి లోనై బలవన్మరణానికి పాల్పడింది.

ఒత్తిడి తట్టుకోలేక చనిపోతున్నారు: వి.ఆర్.జ్యోతి

చిల్లకూరు మండలం కోడూరుకు చెందిన రావెళ్ల బాబు వ్యవసాయం చేసుకుంటూనే అగ్రిగోల్డ్ ఏజెంట్‌గా పని చేశారు. మూడు రాష్ట్రాలలో 30 మంది ఏజెంట్ల ద్వారా రూ.3 కోట్లు వసూలు చేసి కట్టించారు. సభ్యులు ఫోన్ చేసి ఒత్తిడి చేయడంతో 40 సవర్ల బంగారం, ఐదు ఎకరాల పొలం బాధితులకు కుదవపెట్టారు. ఇంకా మిగిలిన సభ్యులు ఒత్తిడి చేయ దంతో మానసికంగా కుంగి పోయి గుండెనొప్పితో మరణించారు.

కుటుంబ పెద్దను కోల్పోయాం: గుడివాడ సత్య ఘన మాణిక్యరావు

నా తండ్రి గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వర రావు 2017లో గుండెనొప్పితో చనిపోయారు. 60 మంది సభ్యుల నుంచి రూ.16 లక్షలు కట్టించారు. కంపెనీ మోసం చేయడంతో సభ్యులు ఒత్తిడి చేయగా ఫోన్ మాట్లాడుతూ గుండెనొప్పితో చనిపోయారు. కుటుంబ పెద్దను కోల్పోయి మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం.

కుటుంబాన్ని పోషించటం కష్టంగా మారింది: నూనె మంగ

నాది పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరు. నా భర్త నూనె సూర్యనారాయణ అగ్రిగోల్డ్‌కు 30 వేల రూపాయలు కట్టినందుకు దిగులుతో 2020లో గుండె నొప్పి వచ్చి చనిపోయారు. దీంతో కుటుంబాన్ని పోషించటం చాలా కష్టంగా ఉంది.

సర్వం కోల్పోయాం: గుంజా విజయలక్ష్మి

మా మామయ్య గుంజ రామకృష్ణ పశ్చిమ గోదావరి జిల్లా వేల్పూరులో బండిపై బిస్కెట్లు అమ్ముకుంటూ జీవనం సాగించేవారు. అగ్రిగోల్డ్‌లో రూ.50 వేలు డిపాజిట్ కట్టారు. కంపెనీ మోసం చేయటంతో దిగులుతో 2020లో చనిపోయారు. నా భర్త మూడు నెలల క్రితం చనిపోయాడు. పైసా పైసా కూడబెట్టి అక్కరకు వస్తాయని అగ్రిగోల్డ్‌లో కడితే ఇంత వరకు ఇవ్వలేదు. రూ.10 వేలు, 20 వేలు చెల్లించిన వారికి ప్రభుత్వం ఇచ్చింది. మాకు ఇవ్వాలని కోరుతున్నాం. ఇద్దరు చిన్న పిల్లలతో, అత్తగారితో కుటుంబ జీవనం కష్టంగా ఉంది.

కుటుంబం మొత్తం దెబ్బతిన్నాం: బొంతు వెంకటేశ్వరరావు

మా వియ్యపురాలు నూనె సూర్యలక్ష్మి ఏజెంట్‌గా సభ్యుల నుంచి రూ.4 లక్షలు కట్టించింది. కంపెనీ ఎత్తేయటంతో కస్టమర్లు ఒత్తిడి చేయడంతో చనిపోయింది. తరువాత ఆమె కుమారుడు కేశవ దుర్గ వెంకటకృష్ణను కూడా సభ్యులు ఒత్తిడి చేయగా మూడు నెలల క్రితం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అత్త, భర్త చనిపోవటంతో మానసిక వ్యధకు గురైన నా కుమార్తె అనారోగ్య కారణంగా ఆస్పత్రిలో ఉండి చికిత్స పొందుతోంది. ఆమెకు ఐదు సంవత్సరాల వయస్సు కలిగిన బాబు అంగవైకల్యంతో ఉన్నాడు. మూడు సంవత్సరాల పాప ఉంది.

30 గంటల ధర్మ పోరాట దీక్షలో అగ్రిగోల్డ్ బాధితులు

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): అధిక వడ్డీ ఆశచూపి పేద, మధ్య తరగతి ప్రజల నుంచి లక్షలాది రూపాయలు సేకరించిన అగ్రిగోల్డ్ కంపెనీ బోర్డు తిప్పేయటంతో ఆందోళన చెందిన బాధితులు ఆత్మహత్యలు చేసుకున్నారు. కస్టమర్లు ఒత్తిడి చేయటంతో ఏజెంట్లు బలవన్మరణాలకు పాల్పడ్డారు. కంపెనీ మోసం చేయటంతో ప్రభుత్వాన్ని ఆదుకోమని కోరగా ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తాను అధికారంలోకి వస్తే కస్టమర్లకు డిపాజిట్లు తిరిగి చెల్లిస్తానని, కంపెనీ సంగతిని కోర్టులు, ప్రభుత్వం చూసుకుంటాయని భరోసా కల్పిం చారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు అయినా ఇంత వరకు బాధితుల గోడు పట్టించుకోలేదు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్వర్యంలో బాధితులు, వారి కుటుంబ సభ్యులు బుధ, గురువారాల్లో విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో 30 గంటల ధర్మ పోరాట దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు తమ ఆవేదనను విశాలాంధ్ర ప్రతినిధికి వివరించారు.

చేతివృత్తిదారులను ఆదుకోవాలి

రామాంజనేయులు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: చేతవృత్తి దారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని చేతవృత్తి దారుల సమాఖ్య ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు విజ్ఞప్తి చేశారు. గురువారం ఏపీ చేతి వృత్తిదారుల సమాఖ్య ప్రచురించిన 2024 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను నగరంలోని చంద్ర రాజేశ్వరరావు భవనంలో రామాంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జనాభాలో 30 శాతానికి పైగా 30 రకాల చేతివృత్తి దారులు ఉన్నారని తెలిపారు. అయితే నేడు నూతన యాంత్రిక, సాంకేతిక పరికరాలు వచ్చిన తర్వాత వీరు తమ వృత్తులను కొనసాగించుకోవడానికి ఆ పరికరాలను కొనుగోలు చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారన్నారు. దీంతో కార్పొరేట్ కంపెనీలు ఈ వృత్తులలోకి ప్రవేశించి చేతివృత్తులను కబళిస్తున్నాయన్నారు. ఈ పోటీలో చేతివృత్తి దారులు తమ వృత్తులను కొనసాగించలేక ఆకలి చావులకు గురవుతున్నారన్నారు. వెనుకబడిన, దళిత, గిరిజన, మైనారిటీలకు చెందిన చేతివృత్తి దారులు సంక్షోభంలో కూరుకుపోయారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో చేతివృత్తి దారుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అధిక నిధులు కేటాయించాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. చేతివృత్తిదారుల సమాఖ్య తీసుకువచ్చిన ఈ నూతన సంవత్సర క్యాలెండర్‌కు ప్రకటనలు ఇచ్చి సహకరించిన వారికి రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథ్, చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం.కారన్న, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బి.మాధవ స్వామి, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రంగనాథ్, సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి, ఏపీ ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి వి.నాగరాజు పాల్గొన్నారు.

'బీసీ' పాలనే జగన్ లక్ష్యం: కృష్ణయ్య

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): వైసీపీ గెలుపుతోనే బీసీల గెలుపని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. బలహీన వర్గాలకు సామాజిక న్యాయంతో పాటు పాలనాధికారమే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. 139 బీసీ కులాల సమావేశం గురువారం విజయవాడ, గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేశ్ అధ్యక్షతన జరిగింది. కృష్ణయ్య మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైసీపీకే తమ మద్దతని ప్రకటించారు. జగన్ నాయకుడే కాదు, సంఘ సంస్కర్త కూడా అని అన్నారు. గత పాలకులు తమను ఓటు బ్యాంకుగానే చూశారన్నారు. టీడీపీ పాలనలో బీసీలకు చేసినదేమీ లేదన్నారు. అమ్మ ఒడి, విద్యాదీవెన వంటి పథకాలు తెచ్చి బీసీల బిడ్డలను జగన్ చదివిస్తున్నారు. ఉన్నత చదవులు కోసం అమెరికా పంపుతున్నారని అన్నారు. జగన్ పాలనలో బీసీల బతుకులు మారాయని చెప్పారు. వైసీపీకి అనుకూలంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేయాలని బీసీలకు పిలుపునిచ్చారు. ప్రతిపక్షాల మోసపు మాటలు నమ్మవద్దని కృష్ణయ్య కోరారు. ఎంపీ బీద మస్తాన్ రావు మాట్లాడుతూ చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ బిల్లును వైసీపీ పెట్టిందని, దీనికి 14 పార్టీల మద్దతు కూడగట్టిందన్నారు. బీసీల చరిత్రలో జగన్‌కు శాశ్వత స్థానం ఉంటుందన్నారు. మారేష్ మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్లకు 56 చైర్మన్లు, 672 డైరెక్టర్ పోస్టులు మొత్తం 100 శాతం బీసీలకు కేటాయించారు. 193 కార్పొరేషన్లకు బీసీలకు 109 కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కడం చూసి ప్రతిపక్ష పార్టీలకు దిమ్మతిరిగిందని వ్యాఖ్యానించారు.

ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం కొత్త సంవత్సర క్యాలెండర్‌ను ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయములో ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ టైపిస్ట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతుల సూరిబాబు, ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, ప్రధాన కార్యదర్శి సురేంద్ర, కోశాధికారి బి.లక్ష్మీదేవి, ఉపాధ్యక్షులు వెంకటేశ్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎ.రాజేశ్వరి, సభ్యులు జి.శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల దిగుమతి రాజకీయం

వైసీపీపై జగదీశ్ మండిపాటు

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేల అభ్యర్థులను కర్నాటక నుండి దిగుమతి చేసుకుని సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ అభ్యర్థుల మనోభావాలు దెబ్బతీస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీశ్ విమర్శించారు. పార్టీ జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జునతో కలసి గురువారం కామ్రేడ్ నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో పోటీకి సత్యసాయి, అనంతపురం జిల్లాల్లో ఒక్క వాల్మీకి సోదరుడు వైసీపీకి దొరక లేదా అని జగదీశ్ ప్రశ్నించారు. మార్పులు, చేర్పుల పేరుతో అనంతపురం, సత్యసాయి జిల్లా లకు అభ్యర్థులను మారుస్తున్నారన్నారు. ఇందు లోనూ ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకే జరుగుతోందని, ఓసీ అభ్యర్థులను ఎందుకు మార్చడం లేదని నిలదీశారు. సత్యసాయి జిల్లాలో ఉన్న వాల్మీకి సోదరులు, హిందూపురం, అనంతపురంలో ఉన్న కురుబ సోదరుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యవహార శైలి ఉందని వ్యాఖ్యానించారు. జగన్‌కు ధైర్యం ఉంటే ప్రాంతీయ సమన్వయకర్తలు సజ్జల రామకృష్ణారెడ్డి, విజయసాయిరెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైవీ సుబ్బారెడ్డిలను మార్చాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో సీఎం జగన్‌పైనే తీవ్ర వ్యతిరేకత ఉందని స్పష్టంచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలంటే 30 కోట్ల రూపాయలు డిపాజిట్ చేయాలని సీఎం డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు. వైఎస్ జగన్ ధన రాజకీయాలు చేస్తూ రాష్ట్రాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని విరుచుకు పడ్డారు. వైసీపీపై ప్రజావ్యతిరేకత ఎప్పటి నుంచో ఉందని, ఇప్పుడు పార్టీలో అసమ్మతి, ఆగ్రహ జ్వాలలు తోడయ్యాయన్నారు. వ్యతిరేకత కారణంగానే మంత్రి ఉషశ్రీ చరణ్‌ను పెనుకొండకు మార్చారని చెప్పారు. రాష్ట్రంలో లౌకికపార్టీలు ఏకమై వైసీపీని మట్టి కరిపించేందుకు సిద్ధమయ్యాయన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య నూతన క్యాలెండర్‌ను నాయకులు ఆవిష్కరించారు. ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పోతలయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు, రామకృష్ణ, రమణ, చేతివృత్తిదారుల సమాఖ్య జిల్లా కార్యదర్శి హరికృష్ణ, ఉపాధ్యక్షుడు నాగప్ప, సీపీఐ సహాయ కార్యదర్శి అల్లిపీర, గోవిందరాజులు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికసంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయండి

కరపత్రాలు, క్యాలెండర్ ఆవిష్కరణలో నాయకుల పిలుపు

విశాలాంధ్ర-మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర 13వ మహాసభలను మంగళ గిరిలో ఈ నెల 20, 21 తేదీలలో జరగనున్నాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం ఆహ్వాన కమిటీ నాయకులు తెలిపారు. చేనేత కార్మికులు పెద్దఎత్తున పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యాల యంలో రాష్ట్ర 13వ మహాసభ కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. దీనితోపాటు ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం క్యాలెండర్‌ను విడుదల చేశారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షుడు, మంగళగిరి చేనేత వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు జొన్నాదుల వరప్రసాద్, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తూరి మోహనరావు, మంగళగిరి వస్త్ర ఉత్పత్తి విక్రయదారుల సంఘం అధ్యక్షులు పెండెం శివరామకృష్ణ, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, ఆహ్వాన సంఘం కోశాధికారి చిన్ని తిరుపతయ్య, ఉపాధ్యక్షులు కట్టా హేమసుందర రావు, బంగారం వ్యాపారి కాటాబత్తుల శేషగిరి, ఏఐటీయూసీ గుంటూరు జిల్లా కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, సీపీఐ నాయకుడు నందం బ్రహ్మేశ్వరరావు, ఆహ్వాన సంఘం కార్యదర్శులు రావెల శివ సత్యనారాయణ, జాలాది జాన్‌బాబు, కమిటీ సభ్యులు బత్తుల గిరి, నాయకులు దొడ్డి ఈశ్వరరావు, బండి నాగేంద్రరావు, గంజి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలొద్దు: శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్న వేళ...కేజీబీవీల్లో పనిచేస్తున్న టీచర్లు సమ్మె చేపట్టడం సమంజసం కాదని సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 352 కేజీబీవీల్లో గతంలో ప్రిన్సిపాళ్లు, సీఆర్టీలు, పీజీటీలు, పీఈటీలు 3039 మంది ఉండేవారని, ఏ కేజీబీవీలోనూ బోధనా సిబ్బంది లేదనే మాట రాకుండా కొత్త నియామకాలు చేపట్టామని, 93 మంది ప్రిన్సిపాళ్లు, సీఈఆర్టీలు 398, పీజీటీలు 1015, పీఈటీలు 49 మంది మొత్తం 1555 మందిని ఇటీవల నియమించామని ఆయన వివరించారు. 41 మంది తెలుగు, ఇంగ్లీష్ పార్ట్ టైం టీచర్లను అర్హత ఆధారంగా కాంట్రాక్టు టీచర్లుగా తీసుకున్నారన్నారు. 2018 నుంచి పార్ట్‌టైమ్‌గా పనిచేస్తున్న దాదాపు 400 మంది పీజీటీల గౌరవ వేతనం రూ.12 వేలు పెంచామన్నారు. దాని ప్రకారం రూ.26,759 అందుకుంటున్నారని పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ప్రాతిపదికన కేజీబీవీల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు ఏడాదికి 15 రోజుల క్యాజువల్ లీవ్‌లతో పాటు మరో ఐదు రోజుల అదనపు క్యాజువల్ లీవ్ సౌకర్యం కల్పించామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియేట్ పరీక్షలు దగ్గరపడుతున్న సమయంలో టీచర్లు తరగతులకు గైర్హాజరు కావడం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడటమేనన్నారు. కాంట్రాక్టు అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం కేజీబీవీ టీచర్లు సమ్మెలో పాల్గొనరాదని సూచించారు. ఇలాంటి చర్యల వల్ల ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

ప్రజా పోరాటాలకు మద్దతు

శ్రీనివాసరావు వెల్లడి

విశాలాంధ్ర-ఏలూరు: అంగన్‌వాడీ, మున్సిపల్, సర్వశిక్షా అభియాన్, వలంటీర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదుల పోరాటాలకు పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు చెప్పారు. వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, విశాఖ ఉక్కు, పోలవరం ప్రాజెక్టు, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాల్లో రాష్ట్రానికి బీజేపీ ప్రభుత్వం ద్రోహం చేసిందని విమర్శించారు. శ్రీనివాసరావు గురువారం పవర్‌పేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం బీజేపీకి దాసోహమై పార్లమెంటులో ప్రతి బిల్లుకు ఆమోదం తెలుపుతున్నదని శ్రీనివాసరావు దుయ్యబట్టారు. మోదీని మూడోసారి ప్రధానిని చేయాలంటున్న జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్...ఆయన వల్ల రాష్ట్రానికి జరిగిన మేలు ఏమిటో చెప్పగలరా అని సవాల్ చేశారు. ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ కూడా అధికారం కోసం మోదీ విధానాలను వ్యతిరేకించడం లేని విమర్శించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీజేపీని, దాని మిత్రపక్షాలను ఓడించాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఈనెల 9,10,11 తేదీల్లో ఏలూరులో జరుగుతాయని శ్రీనివాసరావు తెలిపారు. సమావేశాల్లో కేంద్ర కమిటీ సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబి పాల్గొంటారని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల ప్రతినిధులు హాజరవుతారన్నారు. సమావేశాల్లో బీజేపీ, దాని మిత్రపక్షాలను ఓడించడం, వామపక్ష శక్తుల ఐక్యత, ఎన్నికల వ్యూహాలు తదితర అంశాలపై చర్చలు జరుగుతాయన్నారు. ప్రజల సమస్యలపై తీర్మానాలు చేస్తామని చెప్పారు.

సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ 9వ తేదీ ఉదయం 11 గంటలకు ఆర్ఆర్‌పేటలోని శ్రీకాశీవిశ్వేశ్వర కళ్యాణమండపంలో ఏలూరు జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సు జరుగుతుందని ప్రకటించారు. జిల్లాలో ఉన్న వనరులు, అవకాశాలు, వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాల్లో అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక విడుదల చేస్తామని చెప్పారు.

ఏపీలో కాంగ్రెస్‌కి పూర్వవైభవం: తులసిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి అరణ్యవాసం ముగిసిందని. గత వైభవం ప్రారంభమైందని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మీడియా విభాగం రాష్ట్ర చైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో తులసిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నెహ్రూ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని చెప్పారు.

రాష్ట్ర విభజన తర్వాత పది సంవత్సరాలు అధికారం కోల్పోయి అరణ్యవాసం చేయాల్సి వచ్చిందన్నారు. తెలంగాణలో పదేళ్ల అరణ్యవాసం ముగించుకుని అధికారంలోకి వచ్చిందని, అలాగే, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లోనూ అరణ్యవాసం ముగిస్తుందని ఆశాభావం వెలిబుచ్చారు. నిన్న కర్నాటక, నేడు తెలంగాణ, రేపు ఆంధ్రప్రదేశ్ నినాదంతో ముందుకు పోతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇందిరమ్మ రాజ్యం వస్తుందని, తెలంగాణలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేసినట్లేన న్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఆరు సూత్రాలతో ముందుకు వస్తామన్నారు. విలేకరుల సమావేశంలో విజయవాడ నగర అధ్యక్షుడు నరహరశెట్టి నరసింహారావు. పీవై కిరణ్, కొమ్మినేని సురేశ్ పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతాం

- ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ప్రతి ఇంటికీ వెళ్లి వివరిస్తాం
- తక్షణమే పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- ఆసుల రంగనాయకులు డిమాండ్
- విజయవాడలో కార్మికుల భిక్షాటన

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): మున్సిపల్ పారిశుధ్య కార్మికులను దగా చేసిన సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీ యూసీ) రాష్ట్ర అధ్యక్షుడు ఆసుల రంగనాయకులు హెచ్చరించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆందోళనలో భాగంగా గురువారం విజయవాడ వన్‌టౌన్ నెహ్రూ బొమ్మ సెంటర్ వద్ద కార్మికులు భిక్షాటన చేశారు. ప్రజలను దానం అడుగుతూ ప్రభుత్వం తమకు చేసిన మోసాల గురించి కార్మికులు వివరించారు. ఈ సందర్భంగా రంగనాయకులు మాట్లాడు తూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులను జగన్ ప్రభుత్వం నిలువునా మోసం చేసిందన్నారు. ప్రధాని మోదీ ఏకంగా మున్సిపల్ కార్మికుల కాళ్లు కడిగి కృతజ్ఞతలు తెలిపారని, అదే సమయంలో సీఎం జగన్ కూడా పారిశుధ్య కార్మికులకు ఎంత జీతం ఇచ్చినా తక్కువే అని చెప్పారని గుర్తు చేశారు. వాస్తవానికి తాము రూ.26 వేలు వేతనం ఇవ్వాలని కోరితే మాత్రం సాధ్యం కాదని మొండికేస్తు న్నారని మండిపడ్డారు. మరోవైపు తమకు 10 రోజుల సమయం ఇస్తే సమస్యలన్నీ పరిష్కారం చేస్తామని ప్రభుత్వం చెప్పిందని, ఆచరణలో మాత్రం పూర్తిగా విఫల మైందని విమర్శించారు. చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని, సమస్యల పరిష్కారంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. తక్షణమే పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, సమ్మెను నివారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనట్లయితే ఉదయం నాలుగు గంటల నుంచి రాత్రి వరకు చెత్త సేకరణ కోసం ఇంటింటికీ వెళ్లే పారిశుధ్య కార్మికులు తమకు ప్రభుత్వం చేసిన అన్యాయాన్ని వివరిస్తూ కరపత్రాలు అందజేసి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని కోరతారని హెచ్చరించారు. మహిళ నాయకురాలు దుర్గాసి రమణమ్మ మాట్లాడుతూ కార్మికులు అరకొర జీతాలతో అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించు కోకపోవడం దుర్మార్గమని అన్నారు. వెంటనే కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు విక్కీ, తుపాకుల నాగేశ్వరరావు, జక్కి జేమ్స్, ఏఐటీయూసీ నగర సహాయ కార్యదర్శి కొట్టు రమణారావు, నాయకులు సింగరాజు సాంబశివరావు, ఆకుల ఏసు, భూపతి వెంకటేశ్వరరావు, భారతి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు డైరెక్టర్‌పై చర్యలు: సీపీఎం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన ప్రాజెక్ట్ డైరెక్టర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు 16 రోజులుగా సమ్మె చేస్తున్నారని తెలిపారు. సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా వారిని నిందించేలా మాట్లాడటాన్ని తప్పుపట్టారు. మహిళా ఉగ్యోగులను అవమానిస్తూ వ్యాఖ్యానించిన ఆయన... ఆ పదవికి అనర్హుడని, కావున అతనిపై తక్షణమే చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏపీటీఎఫ్ ఆగ్రహం

కేజీబీవీ, సమగ్ర శిక్ష అభియాన్ సిబ్బంది సమ్మెపై చులకన భావంతో మాట్లాడిన ఆ ప్రాజెక్టు డైరెక్టర్‌పై ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు ఎస్.చిరంజీవి ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తంచేశారు. తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని రోజులుగా వివిధ కేడర్ల సిబ్బంది, కేజీబీవీలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, నాన్-టీచింగ్ సిబ్బంది సమ్మె చేస్తున్నారని, వారి సమస్యలు మాత్రం పరిష్కరించడం లేదని ఆరోపించారు.రాజకీయ నాయకుడిలా ఆయన వ్యవహరించడం తగదన్నారు.

సంపాదకీయం

ఆరని మంటలు

ఇజ్రాయిల్ మొండివైఖరి కారణంగా పశ్చిమ ఆసియాలో సంక్షోభానికి అంతం లేకపోగా మరింత ముదిరిపోయింది. ఇజ్రాయిల్–పలస్తీనా యుద్ధానికి ముగింపు పలికేలా రెండువర్గాల మధ్య చర్చలు సానుకూలంగా సాగుతున్న తరుణంలో సలేహ్ అరౌరీ హత్యోదంతం ఈ ఆశలను ఉన్నట్టుండి నీరుగార్చింది. ఇజ్రాయిల్ దుందుడుకు వైఖరి, అహంభావపూరిత విధానం పశ్చిమాసియాలో మంటలను మరింత రాజేస్తోంది. ఇజ్రాయిల్ –హమాస్ యుద్ధ విరమణకు ఖతార్, ఈజిప్టు దేశాలు ప్రయత్నించిన విషయం విదితమే. అయితే ఈజిప్టు తాజాగా మధ్యవర్తిత్వానికి స్వస్తి చెప్పింది. శాంతి కోసం చేస్తున్న ప్రయత్నాలకు ఇజ్రాయిల్ తూట్లు పొడుస్తున్నదని ఈజిప్టు వర్గాలు ప్రకటించాయి. ఈ మేరకు ఈజిప్టు ఇజ్రాయిల్‌కు ఒక లేఖను కూడా రాసినట్లు ఇజ్రాయిల్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (ఐబీసీ) ఖరారు చేసింది. ఉన్నపళంగా ఈజిప్టు శాంతి యత్నాలను ఉపసంహరించుకోవడానికి ప్రధాన కారణం ఇజ్రాయిల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ, ఆ దేశ నిఘా సంస్థ మొస్సాద్ అధిపతి డేవిడ్ బర్నియా రెచ్చగొట్టే ప్రకటనలేనని స్పష్టమవుతోంది. పైగా హమాస్ అగ్రనేత సలేహ్ అరైరీని ఇజ్రాయిల్ డ్రోన్ మట్టుబెట్టింది. అరౌరీ హమాస్ అల్–కస్సం బ్రిగేడ్ వ్యవస్థాపకుల్లో ఒకరు. లెబనాన్ రాజధాని బీరుట్‌లో ఇజ్రాయిల్ ఎంతో రహస్యంగా చేపట్టిన ఆ డ్రోన్ దాడిలో అరౌరీ మరణించారు. 2006 తర్వాత ఇదే అతిపెద్ద దాడి అని లెబనాన్ పత్రికలు పేర్కొని ఇజ్రాయిల్ వినాశకర చర్యలను ఎత్తిచూపాయి. ఇజ్రాయిల్ వెలుపల హమాస్ నాయకులు ఎక్కడున్నా వెంటాడి వేటాడి చంపుతామని మొస్సాద్ ప్రకటించిన తర్వాతనే ఈ దాడి జరిగింది. ఖలీద్ మెషాల్, మూసా అబూ మర్జౌక్, మహమ్మద్ అల్ డైఫ్ వంటి వారూ ఇజ్రాయిల్ హిట్‌లిస్టులో ఉన్నారు. దీన్ని హమాస్ తీవ్రంగా పరిగణించింది. హమాస్‌పై దాడులకు లెబనాన్‌ను వేదికగా చేసుకోవడాన్ని లెబనాన్ సైతం ఖండించింది. లెబనాన్ సార్వభౌమత్వాన్ని ఇజ్రాయిల్ ఈ దాడితో ధిక్కరించింది. నెతన్యాహూ సేనలు పరిధులు దాటి ప్రవర్తించిన తీరు అమానుషం. చర్చలు అంటూనే ఆ దేశం దొంగదెబ్బతీసింది. ఈజిప్టు, ఖతార్ పెట్టుకున్న నమ్మకాన్ని కూడా వమ్ముచేసింది. ఈజిప్టు కృషిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఐక్యరాజ్యసమితికీ ఇజ్రాయిల్ ద్రోహం చేసింది. సలేహ్ అరౌరీ మరణం ఇరాన్ దేశానికీ నష్టమే. 24 గంటలు గడవకముందే ఇరాన్‌లో జరిగిన జంట పేలుళ్లలో 103 మంది మరణించారు. ఈ పేలుళ్లకూ, ఇజ్రాయిల్ ప్రతీకార దాడులకూ సంబంధం లేకపోలేదని రాజకీయ వర్గాలు సందేహం వ్యక్తం చేస్తున్నాయి. పశ్చిమాసియాలో హమాస్‌కు, లెబనాం కేంద్రంగా పనిచేస్తున్న హిజ్‌బుల్లాకు, యెమెన్‌కు చెందిన హౌతీ రెబల్స్‌కూ ఇరాన్ మొదట్నించీ మద్దతు తెలియజేస్తూనే ఉంది. అమెరికాపై ఇరాన్ తన అసహనాన్ని వ్యక్తం చేయడంలో ఏనాడూ వెనకాడలేదు. అరౌరీ హత్యోదంతంతో అటు పశ్చిమాసియా శాంతికి విఘాతం కలగగా, ఇటు ఇరాన్‌లోనూ ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఇవన్నీ అమెరికా అండతో ఇజ్రాయిల్ పాల్పడుతున్న కవ్వింపు చర్యలకు నిదర్శనమని చెప్పక తప్పదు.

2023 అక్టోబర్ 7న హమాస్ నేతృత్వంలోని పలస్తీనియన్ స్వాతంత్య్ర పోరాట గ్రూపు హమాస్ గాజా స్ట్రిప్ నుండి ఇజ్రాయిల్‌పై పెద్ద ఎత్తున ముట్టడి ప్రారంభించింది. హమాస్ దానిని ఆపరేషన్ అల్–అక్సా తుపానుగా నామకరణం చేసింది. కొంతమంది పరిశీలకులు ఈ సంఘటనలను మూడవ పలస్తీనా తిరుగుబాటుకు నాంది అని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ ఆపరేషన్ ఐరన్ స్వోర్డ్స్ పేరిట ఇజ్రాయిల్ ఎదురుదాడి ప్రారంభించి మారణహోమం సృష్టించింది. అనధికారికంగా వేలాది మంది పలస్తీనియన్ల మరణానికి కారణమైన వివిధ హింసాత్మక సంఘటనలకు ఈ యుద్ధం పరాకాష్ట. ఆ హింసాత్మక ఘటనల్లో ఇజ్రాయిలీ సెటిల్‌మెంట్లు విస్తరించడం, పలస్తీనా పౌరులపై ఇజ్రాయిలీ సెటిలర్ల హింస, మహిళల పట్ల లైంగిక వేధింపులు పెరగడం, జెనిన్ శరణార్థి శిబిరంలో, అల్–అక్సా మసీదు వద్ద ఘర్షణలు ప్రపంచాన్ని దిగ్భ్రాంతి కలిగించాయి. గాజా వెలుపల ఉన్న పలస్తీనియన్లు 'ఆక్రమణదారులపై పోరాటంలో' చేరాలని హమాస్ పిలుపునివ్వడానికి ప్రతిస్పందనగా, నెతన్యాహూ అత్యవసర, యుద్ధ పరిస్థితులను ప్రకటించడం ఆయన చేసిన రెండో తప్పు. కొన్ని ప్రతిపక్ష పార్టీలు జాతీయ ఐక్య ప్రభుత్వ ఏర్పాటుకు పిలుపునిచ్చినా నెతన్యాహూ తన వైఖరి వీడలేదు.

హమాస్ తిరుగుబాటుదారుల ఆకలి ఎన్నో దశాబ్దాల నాటిది. స్వాతంత్య్రం కోసం చేస్తున్న పోరాటం అనిర్వచనీయం. దానికి ఉగ్రముూకగా ముద్రవేయడం బాధాకరమే అయినప్పటికీ, సకాలంలో శాంతి ఒప్పందం కుదిరి ఉంటే ఈ పరిస్థితి దాపురించేది కాదు. అమెరికా తన స్వార్థప్రయోజనాల కోసం ఇజ్రాయిల్‌కు అధునాతన ఆయుధాలన్నింటినీ అందజేస్తూ అగ్నికి ఆజ్యం పోసింది. పశ్చిమాసియాలో ఈనాడు తలెత్తిన సంక్షోభానికి కారణం అమెరికా దురాక్రమణ విధానమే. ప్రాంతానికొక దేశాన్ని ఎంచుకొని యుద్ధోన్మాదాన్ని రెచ్చగొట్టి, అగ్ని జ్వాలలు రేపి, కడుపు చల్లార్చుకునే అమెరికా ఈసారి కూడా తనదైన శైలిలో పశ్చిమాసియాను సంక్షోభంలోకి నెట్టేసింది. స్వేచ్ఛకోసం తపించేవారు ఏదో ఒక రోజు యుద్ధం చేయాల్సిందే. హమాస్ గ్రూపులు తెల్లవారుజామున ఇజ్రాయిల్ పైన కనీసం 3,000 క్షిపణులను ప్రయోగిస్తూ రాకెట్ దాడి చేయడం, ఇజ్రాయిల్ భూభాగంలోకి వాహనాల ద్వారా చొరబాట్లు ప్రారంభించడం అసహజమేమీ కాదు. పలస్తీనా మిలిటెంట్లు గాజా–ఇజ్రాయిల్ కంచె ఛేదించినప్పుడే ఇజ్రాయిల్‌ను అమెరికా వారించి ఉండాల్సింది. దక్షిణ ఇజ్రాయిల్‌లో గాజా సరిహద్దుకు అత్యంత సమీపంలోని ఒక సంగీత ఉత్సవంలో జరిగిన ఊచకోతలో 260 మంది వరకూ హత్యకు గురయిన ఉదంతం ఖండనార్హమే. కాదనలేం. ఇజ్రాయిల్ పౌరులను, సైనికులను పలస్తీనా మిలిటెంట్లు కిడ్నాప్ చేసి గాజా స్ట్రిప్‌కు బందీలుగా తీసుకెళ్లిన తర్వాత నెతన్యాహూ బలగాలు హమాస్ గ్రూపులపై ప్రతీకార దాడుల కన్నా పలస్తీనా కాంక్షిత అమాయక ప్రజలనే ఎక్కువగా లక్ష్యం చేసుకొని ఊచకోత కోశాయి. బాంబులతో ఊళ్లకు ఊళ్లనే శ్మశానంగా మార్చేశాయి. ఇజ్రాయిల్ దాడులను ప్రపంచం యావత్తూ ఖండించింది. భారత్ తప్ప. అమెరికా పెట్టుబడిదారీ వ్యవస్థకు తొత్తుగా ఉన్న మోదీ సర్కారు ఈ విషయంపై నోరు మెదపలేదు. పరోక్షంగా ఇజ్రాయిల్‌కు 'సై' చెప్పినట్లు అర్థం చేసుకోవచ్చు. భారత అలీన విధానం కాలం నుంచి పలస్తీనాతో భారత స్నేహబంధానికి మోదీ ప్రభుత్వం తూట్లు పొడిచింది. నికార్సయిన వైఖరితో తటస్థంగా ఉన్నా సరిపోయేది. ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి అమెరికా తోడ్పాటును ఖండించకపోవడం భారత విదేశాంగ విధానంలో మాయనిమచ్చ. నాటి నెహ్రూ విధానాలను నేటి మోదీ అనుయాయులు పదేపదే విమర్శించడం చూస్తుంటే మోదీ ఫాసిస్టు విధానాలు చెప్పకనే చెపుతున్నాయి.

భారత్ వంటి దేశాల వైఖరుల కారణంగా నెతన్యాహూ విచ్చలవిడిగా అరాచకాలకు పాల్పడుతున్నారు. రాజకీయ ఉనికి కోసం పాట్లుపడుతున్న నెతన్యాహూ గాజాపై విచక్షణారహిత దాడులకు పూనుకోవడాన్ని భారత్ మినహా మిగతా ప్రపంచం గర్హించింది. అయితే అమెరికా సమర్థిస్తూనే ఉంది. ఈలోగా ఎర్రసముద్రంపై హౌతీలు బాంబుదాడులు చేసి ప్రపంచ వాణిజ్యాన్ని దెబ్బతీశారు. భారత్ కూడా నష్టపోయిన విషయం గమనార్హం. సొంతగడ్డపై నెతన్యాహూకు వ్యతిరేకత పెరుగుతున్నది. తాజాగా సుప్రీంకోర్టు సైతం న్యాయవ్యవస్థపై ఆరాటం మానేసి, యుద్ధ విరామంపై దృష్టి పెట్టాలని నెతన్యాహూకి మొట్టికాయలు వేయడం ఆయనకు ఎదురుదెబ్బ. నియంతగా మారడానికి ప్రాథమిక చట్టాలను మార్చాలన్న అతని కుట్రను దేశచరిత్రలోనే తొలిసారి 15 మంది న్యాయమూర్తుల సుప్రీం ధర్మాసనం అడ్డుకుంది. ఇప్పటికైనా బుద్ధితెచ్చుకొని పశ్చిమాసియాలో శాంతిక్రమానికి తోడ్పడితే నెతన్యాహూకి, ఇజ్రాయెల్‌కూ, అమెరికాకూ మంచిది.



విశిష్ట అనువాదకుడు ముకుంద రామారావు

నిఖిలేశ్వర్

28 సంవత్సరాల క్రితం 'వలసపోయిన మందహాసం' (1995)తో పరిచయమైన మిత్రులు యల్లపు ముకుంద రామారావు. ఆనాటి నుంచి ఆత్మీయంగా పలకరిస్తూ, కవిత్వాన్ని పలవరిస్తూ చర్చిస్తూనే ఉన్నారు. 2017 లోగా 8 కవితా సంపుటాలు ప్రచురించి, ఆధునిక తెలుగు కవితా రంగంలో ఆయన ఒక ఆత్మీయ అనుబంధాల కవిగా తనదైన ముద్ర వేయగలిగారు. సైన్స్, సాఫ్ట్‌వేర్ రంగంలో వృత్తి పరంగా నిలదొక్కుకొని, ఆలస్యంగానైనా సాహిత్య క్షేత్రంలో తన కృషిని ప్రారంభించి ప్రతిభను నిరూపించుకున్నారు. ముఖ్యంగా అనువాదాల పరంగా ఆయన మా అందరినీ మించిపోయి, అంతే ఉత్సాహంగా క్రియాశీలంగా వున్నారు. పదులు దాటిన వయసులో ఆయన రచనా పరమైన అభినివేశాన్ని చూస్తూ ఉంటే ముచ్చట వేస్తున్నది. పశ్చిమ బెంగాల్ లోని ఖరగ్‌పూర్‌లో జన్మించి, బెంగాలీల మధ్య పెరిగిన రామారావుకు బంగ్లా, ఇంగ్లీషు, హిందీ రావడం సహజమే కానీ ప్రవాస ఆంధ్రుడిగా తెలుగు భాషా సాహిత్యాలతో మమేకం కావడమే ఆయన ప్రత్యేకత! భక్తి సాహిత్యంపై ఆయన ఆసక్తి, ఆనాటి కవులు, కవి మిత్రుల గురించి అధ్యయనం వ్యక్తిగతంగా ఆధ్యాత్మిక దృష్టికి నిదర్శనం. 21వ శతాబ్దంలో సాంకేతిక ప్రపంచంలో ఆనాటి భక్తి సాహిత్యాన్ని, కవులను తిరిగి గుర్తు చేయడం కొంత ఆశ్చర్యమే! 'అదే నేల' (భారతీయ కవిత్వం నేపథ్యం) 2019 నాటి ప్రచురణ. దాదాపు 900 పేజీల బృహద్ రచన. ఒక దీక్షగా, ఆసాంతం భారతదేశాన్ని వాడుక భాషల పరంగా, మౌఖిక భాషలతో పాటు తన అనువాదాలు పరిచయాలతో తెలుగు పాఠకులకు ఒక సాహిత్య నిధిని సమకూర్చారు.

రామారావు స్వీయ అనువాద రచనల్లో '1901 నుంచి నోబెల్ కవిత్వం', '1901 నుండి సాహిత్యంలో నోబెల్ మహిళలు', 'శతాబ్దాల సూఫీ కవిత్వం', 'అదే గాలి' (ప్రపంచ దేశాల కవిత్వం – నేపథ్యం) ప్రత్యేకంగా పేర్కొనదగినవి. విషయ సేకరణ, వర్గీకరణ – సరైన అనువాదాలు (హిందీ, ఇంగ్లీషు ద్వారా ప్రధానంగా ఒక వ్యక్తిగా ఆయన కృషి ప్రశంసనీయం. కొంతవరకు సాహితీ సంస్థలు, విశ్వవిద్యాలయ తెలుగు శాఖలు చేయవలసిన పని ఒక్కడిగా నిర్వహించారు. (ఈ సందర్భంగా 1988 నుంచి 1991 దాకా డా. దేవరాజు మహారాజు చేసిన భారతీయ కవిత్వ అనువాదాలు, ఏజీ. ఆఫీసు సాహిత్య సంస్థ ప్రచురించిన 'విశ్వ కవిత' గుర్తుకొస్తున్నాయి. 2020 తర్వాత ఇలాంటివే మరికొన్ని సంకలనాలు వెలువడ్డాయి. 2017 నాటికి నేను చేసిన కవితానువాదాల సంకలనం 'అనుసృజన' కూడా వున్నది. సమకాలీన ప్రపంచంలో అసలు సాహిత్యాన్ని ఎంతమంది చదువుతున్నారు? సంఖ్య బాగా తగ్గిపోవడంతో భావి తరాల మీద ఎలాంటి ప్రభావం చూపుతుందో అనే ఆయన ఆందోళనతో నేను ఏకీభవిస్తున్నాను. అయినా సృజనాత్మక రచయితగా రామారావు ఆశావాది. "అనాదిగా కవిత్వం ప్రభావాల నుంచి, సామాజిక పరిస్థితుల నుంచి అనేక మార్పులకు లోనవుతూ వుంది. కవిత్వం ఎప్పుడూ అంత నవనవంగా ఉండడానికి కారణం అదే. భారతీయ భాషల్లోని కవిత్వం రాబోయే కాలాలనూ అంతే నిత్య నూతనంగా వుంటుందన్నది కేవలం నా ఆశే కాదు, గట్టి నమ్మకం కూడా" (అనేక భాషల భారతీయ కవిత్వం – ము.రా. రావు)

కొంతకాలంగా భారతీయ భాషల్లోని కవిత్వం నిరాశాజనకంగా వుందని భావిస్తున్న నాలాంటి వాడికి ముకుంద రామారావు నమ్మకం కలిగిస్తున్నారు.

ఆయన అనువాద కృషికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ఏనాడో రావలసింది. ఇతరత్రా వారికి గుర్తింపు లభించినా, ప్రస్తుతం అజో–విభో – కందాళం ఫౌండేషన్ నుంచి లక్ష రూపాయల పురస్కారానికి ఎంపిక కావడం ఒక ప్రత్యేకత. ఈ సందర్భంగా ముకుంద రామారావును నేను హృదయపూర్వకంగా అభినందిస్తున్నాను.

(ముకుంద రామారావు జనవరి 7న అజోవిభో కందాళం వారి ప్రతిభామూర్తి జీవితకాల సాధన పురస్కారం అందుకుంటున్న సందర్భంగా)

ఉపాధిహామీకి తూట్లు

ఏబీ కూన

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కూలీల కడుపు కొడుతోంది. నిరుపేద జనం ఆకలితో ఆటలాడుకుంటున్నది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ) అమలుకు తూట్లు పొడుస్తున్నది. ఈ పథకం కింద పనిచేస్తున్న కూలీలు తమ జాబ్‌కార్డులకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని ప్రభుత్వం వారి పీకలమీద కత్తిపెట్టింది. 2023 డిసెంబరు 31 వరకు గడువు ఇచ్చింది. ఈ గడువు పొడిగించడానికి కేంద్రం తిరస్కరించడంతో కోట్లాది మంది కూలీలు ఒక్కసారిగా అయోమయంలో పడ్డారు. ఉపాధి కూలీలందరికీ ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ (ఏబీపీఎస్) ద్వారా కూలి డబ్బులు ఇవ్వాలన్నదే కేంద్ర ఉద్దేశం. దీని వల్ల ఎన్నో సాంకేతిక సమస్యలున్నప్పటికీ, ఒక వ్యవస్థను అభివృద్ధి చేయాలని అనుకున్నప్పుడు దానికి కట్టుబడి ఉండాల్సిన అవసరం ఉందనేది కొందరి వాదన. ఇందులో ఎలాంటి సందేహాలు ఉండకపోవచ్చు. కానీ ఉపాధి హామీ చట్టం లబ్ధిదారులంతా కూలీలన్న విషయాన్ని మోదీ ప్రభుత్వం విస్మరించడం విచారకరం. ఉపాధి కూలీలు నమోదయ్యే వరకు తేదీలు పొడిగించాలి. లేకుంటే ఇలాంటి వ్యవస్థనే అమలు చేయకుండా ఉండాల్సింది. అంతేతప్ప కూలీలను చులకనగా చూడటం అసమంజసం. ఉపాధి హామీకి ఆధార్ అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గడువు ముగిసే సమయానికి 34.8% నమోదైన కూలీలు, 12.7% క్రియాశీల కూలీలు అనర్హులని అధికారులు తేల్చిచెప్పారు. అయినప్పటికీ, ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ ద్వారా ఉపాధి వేతనాలను ఇచ్చేయాలని అధికారులకు ఆదేశాలొచ్చాయి. ఏబీపీఎస్ అమలు చేయాలని 2023 జనవరి 30వ తేదీన కేంద్ర ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఆ తర్వాత ఫిబ్రవరి 1, మార్చి 31, జూన్ 30, ఆగస్టు 31 తేదీలను గడువులుగా ప్రకటించింది. ఆఖరిసారిగా డిసెంబరు 31వ తేదీని తుదిగడువు అని తేల్చిచెప్పింది. అయితే అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ఆధార్ సీడింగ్ చేయడంలో విఫలమయ్యారు. దీని కోసం లక్షలాది మంది కూలీలు అదేపనిగా అధికారుల చుట్టూ తిరిగి తిరిగి విసిగి వేసారిపోయారని కూడా కథనాలు వెలువడ్డాయి. రోజువారీ పనులు చేసుకొని పొట్టనింపుకునే వీరిలో ఎక్కువమంది నిరక్షరాస్యులు కావడం కూడా ఆధార్ సీడింగ్‌కు

ఆలస్యమైంది. ఇంత జరిగినా మోదీ ప్రభుత్వం జాలి చూపించకపోగా, కూలీల పట్ల కర్కశంగా వ్యవహరిస్తోంది. గత ఏడాది డిసెంబరు 27 నాటికి కొత్త చెల్లింపు విధానానికి 34.8% మంది అనర్హులుగానే ఉన్నట్లు స్వయంగా గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. గడువు పొడిగించకపోవడం వల్ల జాబ్ కార్డుదారులు కాకుండా 12.7 శాతం క్రియాశీల కూలీలూ ఏబీపీఎస్‌కు అనర్హులుగానే మిగిలిపోయారు. క్రియాశీల కూలీలంటే గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో కనీసం ఒక్కరోజైనా పనిచేసినవారు. వాస్తవానికి ఎంజీఎన్‌ఆర్‌ఈజీపీ కింద 25.25 కోట్ల మందికిపైగా రిజిస్టరయిన కూలీల్లో 14.35 మంది క్రియాశీల కూలీలు ఉన్నారు. ఆధార్ సీడింగ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాల పాత్రే ఎక్కువ. కానీ ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో అభివృద్ధి పనులు, రహదారులు, భవనాలు, కాల్వలు వంటి నిర్మాణాలు పెద్దగా లేకపోవడంతో ఉపాధి పనులు ఆగిపోయినట్లు చెపుతున్నారు. దీనివల్ల రాష్ట్ర అధికారులు కూలీల చెంతకు చేరడమే మానేశారు. వారికి పనిలేకపోతే, నిరుద్యోగ భృతి చెల్లించాలని చట్టం చెపుతోంది. కానీ అది కూడా జరగడం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు చొరవచూపించకపోవడం వల్ల కూడా కూలీల పరిస్థితి దుర్భరమైంది. ఈ నేపథ్యంలో కేంద్రం ఉదారంగా వ్యవహరించి, ఆధార్ సీడింగ్ గడువును పెంచడమొక్కటే మార్గం.

నిజానికి 2014లో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉపాధి హామీ, సమాచార హక్కు వంటి చట్టాలపై అనాసక్తిని ప్రదర్శిస్తూనే ఉంది. ఈ రెండు చట్టాల అమలు బాధ్యతను అదానీ, అంబానీలకు అప్పగించకపోవడమే గొప్ప విషయం. అప్పట్లో యూపీఏ ఛైర్‌పర్సన్, కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ మానస పుత్రికల్లో ఒకటిగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని భావించేవారు. గ్రామీణ ప్రాంత వాసులకు ఏడాదిలో వంద రోజుల పాటు ఉపాధి కల్పించాలనే ఏకైక లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రారంభించారు. అయితే ఈ పథకం అమలులో చాలా రాష్ట్రాలు పూర్తి అశ్రద్ధ చూపిస్తుండటం విచారకరం. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కింద ఈ పథకం అమలవుతోంది. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు అనుగుణంగా 2005 ఆగస్టు 25 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. ఈ చట్టం ద్వారా ప్రతి ఆర్థిక సంవత్సరంలో నైపుణ్యం లేని వయోజనులందరికీ ప్రతి గ్రామీణ కుటుంబంలో పనిని కోరిన వారికి ఆ గ్రామ పరిధిలో 100 పని దినాలు కనీస వేతనం వచ్చేలాగా చట్టపరమైన హామీ లభించింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, భారతదేశ ప్రభుత్వం ఈ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పర్యవేక్షిస్తున్నాయి. ఈ చట్టం ప్రాథమికంగా పూర్తి నైపుణ్యం లేని లేదా కొద్దిపాటి నైపుణ్యం గల పనులు, దారిద్ర్య రేఖ దిగువనున్న వారికి పనులను కల్పించడం ద్వారా గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తిని పెంపొందింపచేయడం కూడా ఒక లక్ష్యమే. ఈ పథకం దేశంలో ధనిక, పేద వ్యత్యాసాన్ని సాధ్యమైనంతమేరకు తగ్గిస్తుందనేది ఆశాభావం. సుమారు మూడవ వంతు పనులను స్త్రీలకు ప్రత్యేకంగా కేటాయించారు. పని చూపించలేకపోతే నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుంది. దీనికి పల్లెప్రాంతాల్లోని ప్రజలు సమీప కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. ఉపాధి వివరాలను ఉత్తరం లేదా రిజిస్టరయిన ఫోన్ నంబర్‌కు తెలియజేస్తారు. ఇందుకోసం వ్యక్తులు బ్యాంకులలో ఖాతా తెరిస్తే, ఈ వేతనం బ్యాంకు ఖాతాలో జమ అవుతుంది. దీనివల్ల గ్రామీణ కూలీల వలసలు తగ్గుతాయని ఆనాటి యూపీఏ సదుద్దేశం. ఈ పథకం అమలులో అశ్రద్ధ, నిధుల దుర్వినియోగం భారీగా జరుగుతున్నట్టు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు మాంటెక్ సింగ్ అహ్లువాలియా కొన్నేళ్ల క్రితం తన నివేదికలో బహిర్గతం చేసిన అంశం ఈ సందర్భంగా ప్రస్తావనార్హం. ముఖ్యంగా ఈ పథకాన్ని ఆనాడు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలే ఎక్కువగా నీరుగార్చుతున్నట్టు ఆయన ఆరోపించారు. తాజా డేటా చూస్తే, బీజేపీపాలిత రాష్ట్రాలు వీటిని రద్దు చేయాలని కూడా కోరుతున్నాయి. బీహార్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమబెంగాల్, ఒడిస్సా, మహారాష్ట్ర, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో పథకం పూర్తిగా నీరుగారిపోయింది. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల్లో పథకం మొదట్లో బాగానే ఉన్నా ఇప్పుడు తిరగబడింది. వీటికి తోడు... నిధుల దుర్వినియోగం భారీ స్థాయిలో జరుగుతున్నట్టు ఆనాడు మాంటెక్ సింగ్ తన నివేదికలో వెల్లడించడం గమనార్హం. లిబ్‌టెక్ ఇండియా నివేదిక ప్రకారం, వేతనాల చెల్లింపునకు నిధులను సమకూర్చడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఈ వైఫల్యం గ్రామీణ ఉపాధి హామీకి తూట్లు పొడవడమే. ఉపాధి హామీ పథకంలో 100 రోజుల పరిమితి వంటి లోటుపాట్లతో నిమిత్తం లేకుండా ఇది గ్రామీణ పేదలకు ఒక జీవనరేఖ అని నిరూపితమైంది. నిరుద్యోగంతో అసహనానికి గురైన వారికి ఇది ఊపిరి పోస్తున్నది. ఒక హక్కు ద్వారా వచ్చిన ఉపాధిని సాంకేతిక పరిజ్ఞానం పేరుతో మోదీ ప్రభుత్వం నోటికాడ కూడును లాక్కోవడం అసహేతుకం. మోదీ తాజా వ్యక్తీకరణ ఈ పథకం పట్ల ఆయనకు గల శత్రుత్వ భావనను స్పష్టంగా చూపిస్తోంది. కూలీల్లో క్రియాశీల, క్రియాశీలేతర అనే పదాలను వాడటమే చాలా తప్పు. అందువల్ల మోదీ ప్రభుత్వం తక్షణమే ఏబీపీఎస్ తప్పనిసరి అన్న షరతును రద్దు చేసి, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా తొలగించిన కూలీల పేర్లను చట్టపరిధిలో చేర్చాలి.

ఈవీఎంలపై ప్రశ్నలకు ఈసీఐ మౌనం

డా.జ్ఞాన్‌పాలక్

ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల)పై సందేహాలు తలెత్తాయి. ఎందుకంటే పాత ఈవీఎంలు ఇంకా వినియోగిస్తున్నారు. ఇవి లోపభూయిష్టంగా ఉన్నాయన్న సందేహాలు ఎక్కువగా ఉన్నాయి. కొత్తగా వచ్చిన ఈవీఎంలో ఓటర్‌ను పరిశీలించే పేపరు ఆడిట్ ట్రైల్ (వీవీపీఏటీ) ఉన్నప్పటికీ అది కూడా సమగ్రమైంది కాదు. ఈవీఎంలలో మార్పులకు అవకాశం ఉండవచ్చు. 2019లో లోకసభ ఎన్నికల ఫలితాలకు సంబంధించి పరిశోధనా పత్రంలో అక్రమాలు కనిపించాయి. ఇండియా కూటమికి చెందిన 28 పార్టీలు 2023 డిసెంబరు 20న సమావేశమై ఎలక్ట్రానిక్ యంత్రాల పనివిధానం, సమగ్రతపై సంశయాలు వ్యక్తం చేశాయి. అంతేకాదు. ఓటర్లకు వీవీఏపీటీ స్లిప్పులు ఇవ్వాలని, లెక్కించిన తర్వాత వందశాతం ఓట్లు ఉన్నట్లు రుజువైతే ఓట్లు తారుమారు చేయలేదని తెలుస్తుంది. ఎన్‌డీఏ పార్టీలతో కూడిన కూటమిచేసిన తీర్మానంలో నిర్దిష్టమైన ప్రశ్నలుచేర్చి ఎన్నికల కమిషన్‌కు సవివరమైన మెమొరాండం అందచేశారు. ఇండియా కూటమి మెమొరాండం నేరుగా అందించాలని యత్నించగా కమిషన్ కలవడానికి తిరస్కరించింది. ఇచ్చిన మెమొరాండానికి కనీసం జవాబుకూడా ఇవ్వలేదు. ప్రతిపక్షపార్టీ వ్యక్తంచేసిన ఆందోళనకు స్పందించలేదు. ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యంలో వెనుతిరిగిన "ప్రజాస్వామ్య వ్యవస్థ" అనే శీర్షికతో గత ఆగస్టులో అశోక్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సవ్యసాచి దాస్ పరిశోధనా పత్రాన్ని విడుదల చేశారు. దీని ప్రకారం బీజేపీకి అనుకూలంగా ఎన్నికల ఫలితాలు వచ్చేలాగా మార్పుచేసే అవకాశం ఉందని, ఇది కేవలం హాస్యాస్పదం కాదని పేర్కొన్నారు. ఆపద్ధర్మ ప్రభుత్వానికి ఓట్ల మార్జిన్‌ను అనుకూలంగా మార్చుకునేందుకుని నిర్దిష్టమైన, నియంత్రణకు అవకాశం ఉంటుంది అని ఇది గెలవడానికి వీలు కల్పిస్తుందని పరిశోధనాపత్రం వెల్లడించింది. పోటాపోటీగా ఉండే నియోజకవర్గాలలో గెలుపు అవకాశాలు గల మార్జిన్‌లు పొందడానికి వీలు కలుగుతుంది. ఈ వాదనలు తిరస్కరించేందుకు ఎన్నికల కమిషన్ లేదా ప్రభుత్వం వద్ద ఏమైనా సమాధానాలున్నాయా? అయితే అశోక్‌యూనివర్సిటీ నుంచి వెలువడిన అంచనా పత్రంపై విస్మయం వ్యక్తం చేయడం ఏమిటని కాంగ్రెస్ ఎంపి శశిథరూర్ తన ట్వీట్‌లో ప్రశ్నించారు. 2019 లోకసభ ఎన్నికల్లో అక్రమాలకు బీజేపీ పాల్పడి అనుకూల ఫలితాలు పొందిందా అని ప్రశ్నించగా దానికి ఎన్నికల కమిషన్ లేదా ప్రభుత్వం వద్ద ఎలాంటి సమాధానాలు లేవు ఎందుకుని? పాత లేదా కొత్త ఈవీఎం యంత్రాల ద్వారా ఓట్ల లెక్కింపుపైన ఎలాంటి సమాధానమివ్వకుండా మరింత రహస్యంగా ఉంచారు. ఓటు పేపరు పరిశీలను ఆడిట్ ట్రైల్‌కు (ఏవీపీఏటీ) ప్రత్యామ్నాయంగా బాక్సులో పడే పేపరును ఓటరుకే అందించాలని ప్రతిపక్షాలు సూచించాయి. ఈ విధంగా వందశాతం వీవీపీఏటీ స్లిప్పులు లెక్కించేందుకు వీలు కలుగుతుంది. ఇండియా కూటమి చేసిన తీర్మానం ప్రకారం, ఓటర్లు అందరికీ పూర్తివిశ్వాసం కలుగుతుంది. లోకసభ ఎన్నికల ఫలితాలు వెలువడకముందే నియోజకవర్గానికి కనీసం ఐదు పోలింగ్ కేంద్రాలల్లో వీవీపీఏటీ స్లిప్పులను తప్పక లెక్కించాలని ఆదేశించాలి. పేపరు సైతం లేని ఈవీఎంలు ఉన్నట్లయితే అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు

నిరూపించడం సాధ్యంకాదు. పాత వీవీపీఏటీలు లేని ఈవీఎంలతో ఫలితంలేదు. పాతవాటి స్థానంలో అన్ని కొత్తవాటిని ప్రవేశపెట్టాలి. ఈవీఎంలలోకి వెళ్లి మార్పులు చేయడం లేదా మార్పులకు అవకాశం ఉందని విమర్శలు వచ్చాయి. ఈ విషయంలో అనేకమంది అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఈవీఎంలలో ఎన్నికలకు ముందు, ఎన్నికల జరిగే సమయంలో లేదా ఎన్నికలు అయిన తర్వాత మార్పులుచేసి ఫలితాలను తారుమారు చేయవచ్చు. ఆరోపణలను తిరస్కరించవచ్చు. ఈవీఎంలను హాకింగ్ లేదా వెలుపలి నుంచి ఎలక్ట్రానిక్ వైర్‌లెస్ జోక్యం ద్వారా ఫలితాలు మారుస్తారని ఆరోపణలు చాలాకాలంగా ఉన్నాయి. ఇందుకు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలులేవు. చాలాసార్లు ఈవీఎంలు రవాణా చేసే సమయంలో అవకతవకలు జరిగాయని, ఎన్నికల నిర్వహణలో పారదర్శకత లేదన్న విమర్శలు అనేకసార్లు వచ్చాయి. చదువులేని ఓటర్లలో కొందరు ఈవీఎంల వినియోగంలో తప్పుచేసినప్పుడు కూడా మార్పులుచేసే అవకాశం ఉందని విమర్శించారు. ఈవీఎంలను క్షుణ్ణంగా పరిశీలించామని, కొన్నిసార్లు ఇతర స్వతంత్ర ఏజెన్సీల ద్వారా ఎన్నికలకు ముందు లేదా ఆ తర్వాత ప్రతిపక్షాలు డిమాండ్ చేసినప్పుడు చేయిస్తామని ఎన్నికల కమిషన్ హామీ ఇస్తుంది. కానీ జరగలేదు. యంత్రాలు విశ్వసనీయమైనవనీ, హ్యాకింగ్‌కు అవకాశంలేదనీ, తారుమారుచేయడం సాధ్యంకాదని కూడా ఎన్నికల కమిషన్ చెపుతోంది. పూర్తిగా పేపరు విధానాన్ని పరీక్షించాలని లేదా స్వతంత్ర ఏజెన్సీని ప్రవేశపెట్టాలని ఇండియాకూటమి డిమాండ్ చేసింది. ఈవీఎంలను1982లో ప్రవేశపెట్టకముందు వీటిని వినియోగించలేదు. జాతీయస్థాయిలో, రాష్ట్రాలలోను 2004లో ఈవీఎంలను ప్రవేశపెట్టారు. ఈవీఎంలపట్ల తమ సందేహాలను, ఆందోళనలను వివరంగా తెలియజేస్తూ ఇండియా కూటమి ఈసీఐకి 2023 ఆగస్టు 9న మెమొరాండం అందచేసింది. డిసెంబరు 30న కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి జైరాంరమేశ్ మరో లేఖ రాశారు. ఇంతవరకు ఈసీఐ సమాధానం ఇవ్వలేదు. కనీసం కలవడానికి 'ఇండియా' కూటమికి ఈసీఐ అవకాశం కల్పించలేదు.

మోదీ గ్యారెంటీ నాటకాలు పనిచేయవు

- రాష్ట్రంలో ఒక్క ఎంపీ సీటూ గెలవదు
- కేరళలో అధికార వామపక్షాలు, కాంగ్రెస్ ధ్వజం

తిరువనంతపురం : రాష్ట్రంలో 'మోదీ హామీ' వంటి నాటకాలు ప్రభావం చూపబోవని కేరళ అధికార వామపక్ష పార్టీలు, ప్రతిపక్ష కాంగ్రెస్ గురువారం నొక్కి చెప్పాయి. దక్షిణాది రాష్ట్రంలో మహిళలకు చేపట్టిన కార్యక్రమాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించిన తర్వాత ఆయనపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తాయి. కేరళ రాజకీయ జలాల్లో కమలం వికసించాలన్న బీజేపీ కల నెరవేరదని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో ఒక్క సీటు కూడా గెలవదని కూడా రెండు కూటముల సీనియర్ నేతలు స్పష్టం చేశారు. బుధవారం త్రిస్సూర్‌లో జరిగిన అఖిల మహిళా సదస్సులో మోదీ ప్రసంగంపై స్పందిస్తూ, కేరళ ప్రజలు ఆయన హామీని నమ్మడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కె.మురళీధరన్ అన్నారు. 'కేరళలో మోదీ హామీ పనికిరాదు. రాష్ట్రంలో ఇలాంటి నాటకాలు ప్రభావం చూపవు. ప్రధానిగా ఆయనకు పర్యటించే స్వేచ్ఛ ఉంది. కానీ ఇక్కడి నుంచి ఒక్క ఎంపీ సీటు కూడా గెలుచుకోలేరు. ఆ సమయాన్ని వృథా చేయడంలో అర్థం లేదు. కేరళ రాష్ట్ర ప్రజలు ఆయన హామీని నమ్మడం లేదు' అని మురళీధరన్ చెప్పారు. త్రిస్సూర్‌లో మోదీ కార్యక్రమానికి కొంతమంది ప్రముఖ నటులు, క్రీడాకారులు హాజరు కావడం గురించి అడిగినప్పుడు అటువంటి వ్యక్తులు ప్రధాని పాల్గొనే కార్యక్రమాలలో పాల్గొనడం సర్వసాధారణమని కాంగ్రెస్ నాయకుడు అన్నారు. 'మేము అధికారంలోకి రాగానే మా కార్యక్రమాలకు కూడా హాజరవుతారు' అని తెలిపారు. త్రిస్సూర్‌లో బీజేపీ నిర్వహించిన భారీ మహిళ-మాత్రమే కార్యక్రమంలో మోదీ ఆవేశపూరిత ప్రసంగం చేశారు. తన ప్రభుత్వ మహిళా సాధికారత చర్యలను, ముఖ్యంగా మహిళా రిజర్వేషన్ బిల్లును నొక్కి చెప్పారు. ఈ కార్యక్రమాలు 'మోదీ హామీ'లో భాగమని అన్నారు. మళయాళంలో 17 సార్లుకు పైగా 'మోడియుడే గ్యారెంటీ' (మోదీ హామీని) పునరుద్ఘాటించారు. ఉజ్వల, కుళాయి నీటి కనెక్షన్లు, మరుగుదొడ్లు, ముద్రా రుణాలు, మరిన్ని అనేక కార్యక్రమాలను ఉటంకిస్తూ, మహిళా సాధికారతలో తన ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రధాన మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ట్రిపుల్ తలాక్ నుంచి ముస్లిం మహిళలకు స్వేచ్ఛను హామీ ఇచ్చామని, దానిని నిజాయితీగా నెరవేర్చామని మోదీ చెప్పారు. ఇదిలాఉండగా, త్రిసూర్‌లో రాష్ట్ర రెవెన్యూ మంత్రి, సీపీఐ నేత కె.రాజన్ మీడియాతో మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసలో అతలాకుతలమవుతున్న మహిళలకు ప్రధాని క్షమాపణలు చెప్పాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ మణిపూర్‌ను మ్యాప్‌లో గుర్తించి రాష్ట్రాన్ని సందర్శించాలని కోరారు. రాష్ట్ర మంత్రి రాజన్ మాట్లాడుతూ 'అక్కడ (త్రిస్సూర్) హాజరయిన మహిళలు ఆయన మణిపూర్ గురించి ఏదైనా మాట్లాడతారని ఊహించారు. మణిపూర్‌లో హింసాకాండలో నగ్నంగా పరిగెత్తాల్సిన ఇద్దరు మహిళలను గుర్తుంచుకోండి. వారు కేవలం ఏ సామాజిక వర్గానికి చెందినవారు కాదు. వారు దేశంలోని మహిళల ప్రతినిధులు. మన దేశం... త్రిసూర్‌లో హాజరయిన మహిళల ముందు వారు అనుభవించిన బాధకు ప్రధాని కనీసం క్షమాపణ చెప్పాలి' అని అన్నారు. తన ప్రసంగంలో బంగారం స్మగ్లింగ్‌పై ప్రధాని చేసిన వ్యాఖ్యలపై రాజన్‌ను ప్రశ్నించగా, ఏడేళ్లుగా ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులపై కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నీ దర్యాప్తు చేస్తున్నాయని, ఏమీ కనుగొనలేదని తెలిపారు. ఇలాంటి నకిలీ కథనాలకు మేం భయపడబోమని ఆయన అన్నారు.

పెట్రోల్, డీజిల్‌పై కేంద్రం దోపిడీ: ఖర్గే

న్యూదిల్లీ: దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఇప్పట్లో తగ్గించేది లేదని కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రకటనపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వ దోపిడీపై మాత్రం నియంత్రణ లేదని దుయ్యబట్టారు. కొంతకాలంగా ముడిచమురు ధరలు తగ్గినట్లు వచ్చిన వార్తా కథనాన్ని ప్రస్తావిస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ముడిచమురు ధరలు తగ్గుతున్నాయని, కానీ, కేంద్ర ప్రభుత్వ దోపిడీ మాత్రం ఆగడం లేదని నిందించారు. ధరలు తగ్గించే విషయంపై ఆయిల్ కంపెనీలతో చర్చలు జరపలేదని కేంద్ర మంత్రులే చెబుతున్నారని, చమురు కంపెనీలు పెట్రోల్‌పై రూ.8 నుంచి రూ.10, డీజిల్‌పై రూ.3 నుంచి రూ.4 లాభం పొందుతున్నాయని ఖర్గే పేర్కొన్నారు. 19 నెలల్లో ముడిచమురు ధర 39 శాతం తగ్గిందని వచ్చిన వార్తా కథనాన్ని పోస్టు ఆయన చేశారు. ఇదిలాఉంటే, అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తీవ్ర హెచ్చు తగ్గులకు లోనవుతున్నాయని, చమురు ధరల్లో స్థిరత్వం వచ్చే వరకూ ధరల తగ్గింపు అవకాశం లేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరి చెప్పిన సంగతి తెలిసిందే. ఈ విషయంపై దేశీయ ఆయిల్ మార్కెటింగ్ సంస్థల (ఇండియన్ ఆయిల్, హిందుస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం కంపెనీలు)తో ఎటువంటి చర్చలు జరగలేదని చెప్పిన నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్షుడు ఈ విధంగా స్పందించారు.

మేము చేసేదేమీ లేదు

నిఖిల్ గుప్తా కుటుంబం పిటిషన్‌పై సుప్రీం

న్యూదిల్లీ: ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత 'సిఖ్స్ ఫర్ జస్టిస్' నేత గురుపత్వంత్ సింగ్ పన్నూ హత్య కుట్ర కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తాపై అభియోగాలు దాఖలయ్యాయి. కాన్సులర్ యాక్సెస్, న్యాయసాయం అభ్యర్థిస్తూ గుప్తా బంధువు వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఇందులో తాము చేయగలిగేదేమీ లేదని, మీకు వియన్నా ఒప్పందంలో భాగంగా కాన్సులర్ యాక్సెస్ లభించిందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. అలాగే విదేశీ కోర్టు సార్వభౌమత్వాన్ని, న్యాయపరిధిని గౌరవించాలని తెలిపింది. మునుపటి విచారణలో కోర్టు స్పందిస్తూ... ఇది అత్యంత సున్నితమైన అంశమని, మరో దేశంలో జరిగిన అరెస్టు తమ పరిధిలోకి రాదని తెలిపింది. అందువల్ల దీనిపై మీరు ఆ దేశ (చెక్ రిపబ్లిక్) కోర్టుకు వెళ్లాలని సూచించింది. అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, ఈ కుట్ర కేసులో భారత్‌కు చెందిన నిఖిల్ గుప్తా ప్రమేయం ఉందంటూ కొద్దినెలల క్రితం అమెరికా అటార్నీ కార్యాలయం ఆరోపించింది. ఇందుకోసం అతడికి ఓ భారత ప్రభుత్వ అధికారి నుంచి ఆదేశాలు అందాయని అమెరికా ఆరోపణలు చేసింది. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా పరిగణించింది. ఈ కేసులో అత్యున్నతస్థాయి కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరుపుతామని ప్రకటించింది. మరోవైపు, 52 ఏళ్ల నిఖిల్ గుప్తాను ఈ ఏడాది జూన్‌లో చెక్ రిపబ్లిక్ అధికారులు అరెస్టు చేశారు. ప్రస్తుతం అతడు ప్రేగ్‌లోని ఓ జైల్లో ఉన్నాడు. అతడిని తమకు అప్పగించాలని ఆ దేశంపై అమెరికా ఒత్తిడి తెస్తోంది. ఈ కేసుపై విదేశాంగ శాఖ స్పందిస్తూ... తమకు మూడుసార్లు కాన్సులర్ యాక్సెస్ లభించిందని తెలిపింది.

కొత్తగా 760 కరోనా కేసులు

న్యూదిల్లీ: కరోనా కొత్త వేరియంట్ జేఎన్-1 కేసులు భారతదేశం సహా అనేక దేశాలలో పెరుగుతున్నాయి. కరోనా మరణాలు కూడా నమోదవుతున్నాయి. భారత్‌లో 20 రోజులుగా ప్రతిరోజూ కొత్తగా సగటున 500 కరోనా కేసులు నమోదవుతున్నాయి. కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దేశంలో కొత్తగా 760 మందికి ఇన్ఫెక్షన్ నిర్ధారితమైంది. జేఎన్-1 వేరియంట్ ఇప్పటివరకు దేశంలోని 11 రాష్ట్రాలకు వ్యాపించింది. దేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 4423కు చేరింది. కరోనా ముప్పు పెరుగుతోందని, దీని నివారణకు అందరూ జాగ్రత్తగా ఉండాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. పెరుగుతున్న కేసుల దృష్ట్యా కేంద్రం... రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను అప్రమత్తం చేసింది. ప్రస్తుతం కేరళ, కర్నాటక రాష్ట్రాల్లో అత్యధికంగా కరోనా కేసులు నమోదయ్యాయి. గడచిన 24 గంటల్లో దేశంలో కోవిడ్ కారణంగా ఐదు మరణాలు నమోదయ్యాయని నేషనల్ సెంటర్ ఫర్ డీసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ) తెలిపింది.

నెహ్రూ విధానాల వల్లే ఇబ్బందులు

చైనాతో సంబంధాలపై మంత్రి జైశంకర్

న్యూదిల్లీ: కొత్త ఏడాదిలోనూ ప్రపంచంలో ఒడుదుడుకులు ఉంటాయని విదేశాంగమంత్రి జై శంకర్ అన్నారు. వీటిని ఎదుర్కొనేలా భారత్ ఆర్థికంగా, రాజకీయంగా మెరుగైన స్థితిలో ఉందని ధీమా వ్యక్తం చేశారు. తాను రాసిన 'వై భారత్ మేటర్స్' పుస్తకావిష్కరణలో మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విదేశాంగ విధానంపై విమర్శనాత్మకంగా ఆయన స్పందించారు. '2024లో ప్రపంచ పరిస్థితులు కల్లోలంగానే ఉంటాయి. గతేడాది అంశాలే కొత్త సంవత్సరంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఈ సవాళ్లు ఎదుర్కొనే విషయంలో మనం రాజకీయంగా, ఆర్థికంగా మెరుగైన స్థితిలో ఉన్నాం' అని జై శంకర్ అభిప్రాయపడ్డారు. భారత్-చైనా సంబంధాల విషయంలో తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ విధానాలపై స్పందిస్తూ... 'మన దేశ ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇచ్చి ఉంటే చైనాతో బంధంపై ఆశలు పెంచుకొనే వాళ్లం కాదు. ఇదంతా నేను ఊహించి చెప్పడం లేదు. ఈ మాటలు బలపర్చే ఆధారాలున్నాయి. ఈ విషయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్-నెహ్రూ మధ్య నడిచిన లేఖల్లోనే భిన్నాభిప్రాయాలున్నట్లు కనిపిస్తోంది' అని మంత్రి అన్నారు. భద్రతా మండలిలో చైనాకు చోటు దక్కేలా నెహ్రూ అనుసరించిన విధానాన్ని ఎత్తి చూపారు. 1962లో చైనాతో యుద్ధం సమయంలో అమెరికా మద్దతు తీసుకోవడానికి ఆయన సంకోచించారని ఆరోపించారు. కానీ, దీనిపై సర్దార్ పటేల్ స్పందన మాత్రం భిన్నంగా ఉందన్నారు. 'అమెరికా పట్ల ఎందుకంత అపనమ్మకంగా ఉండాలి. చైనా-అమెరికా బంధం కోణం నుంచి కాకుండా...మన ప్రయోజనాల దృష్టితో చూడాలి' అని పటేల్ అభిప్రాయంగా ఉండేదని తెలిపారు. ఇది వరకు ఇంటర్వ్యూలో కూడా... చైనాతో వాస్తవికత ఆధారంగా వ్యవహరించాలని జై శంకర్ అన్నారు. పరస్పర గౌరవం, ప్రయోజనాలపై ఆధారపడి సంబంధాలు ఉండాలని స్పష్టంగా చెప్పారు.

ప్రభుత్వ వసతి రద్దుపై

డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్‌ను సంప్రదించండి

మొయిత్రాకు సూచించిన దిల్లీ హైకోర్టు

న్యూదిల్లీ : ప్రభుత్వ వసతి రద్దుపై డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్‌ను సంప్రదించవలసిందిగా పార్లమెంటు నుంచి బహిష్కరణకు గురైన టీఎంసీ లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రాను దిల్లీ హైకోర్టు గురువారం కోరింది. ఆమెను బహిష్కరించిన తర్వాత రద్దు చేసిన తనకు కేటాయించిన ప్రభుత్వ క్వార్టర్స్‌లో కొనసాగేందుకు అనుమతించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది.

ఆమెను బహిష్కరించిన తర్వాత కేటాయింపును రద్దు చేసినందున జనవరి 7 లోపు ప్రభుత్వ బంగ్లాను ఖాళీ చేయాలన్న అధికారిక ప్రకటనను సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ సుబ్రమణియన్ ప్రసాద్ విచారించారు. అసాధారణమైన పరిస్థితులలో నిర్దిష్ట చార్జీల చెల్లింపుపై నివాసి ఆరు నెలల వరకు ఎక్కువ కాలం ఉండేందుకు అధికారులను నిబంధనలు అనుమతిస్తున్నాయని న్యాయమూర్తి పేర్కొన్నారు. 'డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ ముందు అభ్యర్థనన ఉంచండి. చట్ట ప్రకారం చర్య తీసుకోబడుతుంది' అని న్యాయమూర్తి చెప్పారు. మొయిత్రా తన పిటిషన్‌ను ఉపసంహరించుకోవడానికి కోర్టు అనుమతించింది. ఈ విషయం యోగ్యతపై ఎటువంటి పరిశీలనలు చేయలేదని, డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ తన ఆలోచనను వెల్లడించిన తర్వాత ఆమె కేసును నిర్ణయిస్తామని పేర్కొంది. బహిష్కరణకు ముందు నివాసికి నోటీసు జారీ చేయడాన్ని చట్టం ఆదేశిస్తుంది. చట్టం ప్రకారం పిటిషనర్‌ను తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మొయిత్రా తరపున సీనియర్ న్యాయవాది పినాకి మిశ్రా వాదనలు వినిపిస్తూ, ప్రస్తుతానికి ప్రత్యామ్నాయ వసతి కోసం వెతకడం ఆమెకు కష్టంగా ఉన్నందున రాబోయే సాధారణ ఎన్నికల వరకు ప్రభుత్వ బంగ్లాలో ఉండటానికి మాజీ ఎంపీకి అనుమతి ఇవ్వాలని అన్నారు. ఆమె బహిష్కరణపై సుప్రీం కోర్టు ఎలాంటి స్టే లేదని కోర్టుకు తెలియజేశారు. విచారణ సందర్భంగా న్యాయమూర్తి, ఆమె ప్రభుత్వ వసతిని రద్దు చేయడానికి దారితీసిన బహిష్కరణ ఉత్తర్వుపై సుప్రీం కోర్టు స్టే ఇవ్వనప్పుడు హైకోర్టు ఏమి చేయగలదని అన్నారు. రెండు అంశాలు భిన్నమైనవని, ప్రభుత్వ వసతి ప్రశ్న సుప్రీం కోర్టు ముందు లేవనెత్తలేదని సీనియర్ న్యాయవాది చెప్పారు. అయితే, వసతిని కొనసాగించాలన్న అభ్యర్థనతో మొయిత్రా ఇంకా అధికారులను సంప్రదించలేదన్న దానిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు, పిటిషన్‌ను తోసిపుచ్చుతూ, తగిన ప్రాతినిధ్యాన్ని దాఖలు చేయడానికి ఆమెను అనుమతించింది. తన కేటాయింపును రద్దు చేస్తూ డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ డిసెంబర్ 11న జారీ చేసిన ఉత్తర్వులను పక్కన పెట్టాలని లేదా ప్రత్యామ్నాయంగా 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడేంత వరకు తనకు నివాసం ఉండేలా అనుమతించాలని మొయిత్రా తన పిటిషన్‌లో కోరారు.

పెరుగుతున్న సైబర్ నేరాలు

రూ.10 వేల కోట్లకు పైగా స్వాహా

న్యూదిల్లీ: సైబర్ మోసాలు ఇటీవల కాలంలో బాగా పెరిగాయి. ఓ చిన్న మెసేజ్‌తో ఖాతాల్లోని నగదు దోచేస్తున్నారు. 2021 ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు దేశంలో సుమారు రూ.10,300 కోట్లకు పైగా నగదును సైబర్ నేరగాళ్లు స్వాహా చేసినట్లు ఓ నివేదిక వెల్లడించింది. ఈ మొత్తంలో ఏజెన్సీలు రూ.1,127 కోట్లు బ్లాక్ చేయగలిగినట్లు ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ తెలిపింది. సైబర్ నేరాలకు సంబంధించి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్‌సీఆర్‌పీ)లో ఐదువేలకు పైగా ఫిర్యాదులు నమోదవుతున్నాయని ఐ4సీ సీఈఓ రాజేశ్ కుమార్ తెలిపారు. 40-50 శాతం కంబోడియా, మైన్మార్ ముఠాలు మోసాలకు పాల్పడుతున్నాయని పేర్కొన్నారు. 2021లో 4.52 లక్షలకు పైగా సైబర్ క్రైమ్ కేసులు నమోదు కాగా, 2022లో 113.7 శాతం పెరిగిందని, పోర్టల్‌లో 9.66 లక్షల కేసులు నమోదయ్యాయని తెలిపారు. 2023లో 15.56 లక్షల కేసులు నమోదు కాగా, 2022తో పోలిస్తే వృద్ధి రేటు 60.9 శాతం తగ్గిందని వెల్లడించారు. లక్ష జనాభాకు 129 సైబర్ క్రైమ్ కేసులు నమోదైనట్లు రాజేశ్ కుమార్ తెలిపారు. బాధితులు తమ ఫిర్యాదులు నమోదు చేసుకోవడానికి 1930 కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చని, మోసం జరిగిన గంటలోపే కాల్ చేస్తే బ్యాంకులు నగదు రివకరీ చేస్తాయని అన్నారు. యూపీఐ వ్యవస్థను అభివృద్ధి చేసిన నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహా సుమారు 263 బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ హెల్ప్‌లైన్‌కి లింక్ చేయబడ్డాయన్నారు.

లక్షదీవుల్లో మోదీ 'స్నార్కెలింగ్' సాహసం

న్యూదిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ లక్షద్వీప్ పర్యటనలో భాగంగా అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించారు. సముద్రం ఒడ్డున కూర్చుని సేద తీరారు. అంతేకాకుండా సముద్రంలో స్నార్కెలింగ్ (సాహసంతో కూడిన స్విమ్మింగ్) చేశారు. సముద్ర గర్భంలోని పగడపు దిబ్బలు, జీవరాశులను ప్రత్యక్షంగా వీక్షించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ప్రధాని తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. లక్షదీవుల సౌందర్యం, అక్కడి ప్రజల మమకారం చూసి నేనింకా సంభ్రమాశ్చర్యంలోనే ఉన్నా. ప్రకృతి అందాలు, ప్రశాంతమైన వాతావరణంతో ఈ దీవులు మనల్ని మంత్రముగ్ధులను చేస్తున్నాయి. 140 కోట్ల మంది భారతీయుల సంక్షేమం కోసం నేను మరింత కష్టపడి ఎలా పనిచేయాలో ఈ వాతావరణం నాకు నేర్పింది. సాహసాలు చేయాలనుకునేవారు.. మీ లిస్ట్‌లో లక్షద్వీప్‌ను కూడా చేర్చుకోండని మోదీ రాసుకొచ్చారు. లక్షద్వీప్‌లో తాను స్నార్కెలింగ్ కూడా ప్రయత్నించినట్లు మోదీ తెలుపుతూ ఆ చిత్రాలను షేర్ చేశారు. పగడపు దీపులు, చేపల ఫొటోలు పంచుకున్నారు. 'ఇది ఎంతో అద్భుతమైన అనుభవం' అని పేర్కొన్నారు. స్నార్కెలింగ్ అనేది సముద్రంలో చేసే ఓ తరహా డైవింగ్ లాంటిది. స్నార్కెల్ అనే ట్యూబ్, డైవింగ్ మాస్క్‌ను ముఖానికి ధరించి సముద్రం లోపల ఈత కొడుతారు.

మాజీ మోడల్ హత్య...వీడిన మిస్టరీ

పోలీసుల చేతికి సీసీ టీవీ దృశ్యాలు

గురుగ్రామ్: కలకలం సృష్టించిన మాజీ మోడల్ దివ్య పహుజా హత్యకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు అభిజీత్ సింగ్ సహా మొత్తం ఐదుగురు ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని మాయం చేసేందుకు ప్రయత్నిస్తుండగా... ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. గురుగ్రామ్‌లో బుధవారం జరిగిన ఈ హత్య తీవ్ర కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. దివ్య పహుజా ఇప్పటికే గ్యాంగ్‌స్టర్ సందీప్ గడోలీ నకిలీ ఎన్‌కౌంటర్ కేసులో నిందితురాలు. ఏడేళ్ల పాటు జైలులో ఉన్న ఆమె... కొన్ని నెలల క్రితం బెయిల్‌పై బయటకొచ్చింది. అభిజీత్ సింగ్ ఆమెను హోటల్ రూమ్‌కు తీసుకెళ్లి కాల్చి చంపినట్లు పోలీసులు వెల్లడించారు. హోటల్ యజమాని అయిన తనను ఆమె కొన్ని అశ్లీల ఫొటోలతో బెదిరించి డబ్బు డిమాండ్ చేసేదని, అందుకే ఈ హత్యకు పాల్పడినట్లు అభిజీత్ అంగీకరించాడని పోలీసులు చెప్పారు. ఈ ఆరోపణలను దివ్య కుటుంబ సభ్యులు తీవ్రంగా ఖండించారు. అభిజీత్ సింగ్ సహా హోటల్‌లో పనిచేసే ముగ్గురు సిబ్బంది ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్నారు. మృతదేహాన్ని ఓ తెల్లటి గుడ్డలో చుట్టి హోటల్ లాబీ నుంచి లాక్కెళ్తున్న దృశ్యాలు సీసీటీవీల్లో నమోదైనట్లు పోలీసులు తెలిపారు. బెదిరించి డబ్బు డిమాండ్ చేసినందుకు అభిజీత్ సింగే ఈ హత్యకు పాల్పడ్డాడని, ఆమె మృతదేహాన్ని మాయం చేసేందుకు సిబ్బందిని పురమాయించాడని పేర్కొన్నారు. మరోవైపు దివ్య సోదరి నైనా పహుజా మాత్రం పోలీసుల ఫిర్యాదులో భిన్నమైన ఆరోపణలు చేశారు. సందీప్ గడోలీ సోదరి సుదేశ్ కటారియా, సోదరుడు బ్రహ్మ ప్రకాశ్‌లే అభిజీత్‌తో కలిసి ఈ హత్య చేయించారని ఆరోపించారు.

అయోధ్య రామాలయాన్ని పేల్చేస్తాం..

సీఎంకు బెదిరింపులు... ఇద్దరి అరెస్టు

లక్నో: అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ తేదీ దగ్గరపడుతున్న వేళ...ఆలయాన్ని పేల్చేస్తామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టించింది. యోగి ఆదిత్యనాథ్‌తో పాటు త్వరలో ప్రారంభం కానున్న రామమందిరాన్నీ పేల్చేస్తామని బాంబు బెదిరింపులు వచ్చాయి. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో గోండాకు చెందిన తాహర్ సింగ్, ఓం ప్రకాష్ మిశ్రా అనే ఇద్దరు యువకులను అరెస్టు చేశారు. వీరిద్దరూ పారామెడికల్ ఇనిస్టిట్యూట్‌లో పని చేస్తున్నారని తెలిపారు. తాహర్ సింగ్ మెయిల్స్ సృష్టించగా...ప్రకాశ్ బెదిరింపులకు పాల్పడినట్టు తెలుస్తోంది. ఆ యువకులు ఇద్దరూ ముస్లింల పేరుతో బెదిరించిన హిందువులుగా భావిస్తున్నారు. సీఎం యోగి ఎస్టీఎఫ్ చీఫ్ అమితాబ్ యశ్, అయోధ్యలోని రామ మందిరాన్ని పేల్చేస్తామని ఈ మెయిల్ ద్వారా పంపించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. అయితే.. ఈ మెయిల్స్‌ను పాకిస్తాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐకి చెందిన అధికారిగా చెప్పుకునే జుబేర్ ఖాన్ అనే వ్యక్తికి చెందినట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆదిత్యనాథ్ నివాసం వద్ద భద్రత కట్టుదిట్టం చేశారు.

బుల్డోజర్‌తో గ్యాంగ్‌స్టర్ ఇల్లు కూల్చివేత

లక్నో: రౌడీ షీటర్ అశోక్ యాదవ్ అలియాస్ మున్నా యాదవ్‌పై ఉత్తరప్రదేశ్ పోలీసులు కొరడా ఝుళిపించారు. బుల్డోజర్‌తో అతని ఇంటిని కూల్చివేశారు. డిసెంబరు 25న మున్నాను అరెస్టు చేయడానికి పోలీసులు బిషన్‌గర్ ప్రాంతంలోని ధరి ధీర్‌పూర్ నగరియ గ్రామానికి వెళ్లారు. ఆ సమయంలో మున్నా ఇంటి లోపలే ఉన్నాడు. ఇంటి బయట ఉన్న సీసీ కెమెరా ద్వారా పోలీసులు వస్తున్నారన్న విషయం తెలుసుకున్నాడు. వారు రాగానే ఒక్కసారిగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో సచిన్ రాఠీ అనే కానిస్టేబుల్ మృతి చెందాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు... ఎన్‌కౌంటర్‌లో రౌడీషీటర్ మున్నా యాదవ్, అతని కుమారుడిని అరెస్టు చేశారు. వారి అక్రమ ఆస్తులపై విచారణ చేసేందుకు రెవెన్యూ బృందం నగరియ గ్రామానికి చేరుకుంది. అన్ని రకాల పత్రాలు పరిశీలించిన తర్వాత... మున్నా నిబంధనలు అతిక్రమించాడని ప్రభుత్వం గుర్తించింది. అనంతరం ఇల్లు కూల్చేసే చర్యలు తీసుకున్నారు. ఇంటిని కూల్చివేస్తున్న సమయంలో ఆ ప్రాంతంలో పోలీసులు భారీగా మోహరించారు.

చత్తీస్‌గఢ్‌లో 88 మంది ఐఏఎస్‌ల బదిలీ

రాయ్‌పూర్: చత్తీస్‌గఢ్‌లో కొత్తగా ఎన్నికైన బీజేపీ ప్రభుత్వం 88 మంది ఐఏఎస్ అధికారులను, ఓ ఐపీఎస్ అధికారిని బదిలీ చేసింది. అందులో 19 జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. సాధారణ పరిపాలనా శాఖ బుధవారం అర్ధరాత్రి ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి భూపేష్ బఘేల్ సన్నిహితులు కూడా బదిలీ అయిన వారిలో ఉన్నారు. రాయ్‌పూర్, మనేంద్రగర్- చిర్మిరి-భరత్‌పూర్ (ఎంసీబీ), కాంకేర్, కోర్బా, రాజ్‌నంద్‌గావ్, బెమెతర, కొండగావ్, దుర్గ్, సూరజ్‌పూర్, నారాయణ్‌పూర్, దంతెవాడ, బీజాపూర్, సుర్గుజా, జంజ్‌గిరి-చంపా, బలోద్, ధామ్‌తరి, సారన్‌ఘరి-బిలైఘర్, ఖైరాగఢ్-చుయిఖదన్-గండై, గరియాబండ్ జిల్లాల కలెక్టర్లను బదిలీ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన అనంతరం గతేడాది డిసెంబర్ 19న 2006 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారి పి.దయానంద్‌ను ముఖ్యమంత్రి కార్యదర్శిగా నియమించిన సంగతి తెలిసిందే. ఆయనను వైద్య విద్య కార్యదర్శి నుండి తప్పించి... ఇంధనం, ఖనిజ వనరులు, ప్రజాసంబంధాల శాఖల కార్యదర్శి, చత్తీస్‌గఢ్ రాష్ట్ర పవర్ కంపెనీ చైర్మన్, వాణిజ్య, పరిశ్రమల, విమానయాన శాఖల కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. 2006 బ్యాచ్‌కి చెందిన మరో ఐపీఎస్ అధికారి మయాంక్ శ్రీవాస్తవను ప్రజా సంబంధాల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

ఎంఈఏ ప్రతినిధిగా జైస్వాల్

న్యూదిల్లీ : విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఈఏ)తదుపరి అధికార ప్రతినిధిగా సీనియర్ దౌత్యవేత్త రణధీర్ జైస్వాల్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఆ బాధ్యతలు నిర్వహించిన అరిందమ్ బాగ్చి నుండి జైస్వాల్ బాధ్యతలు స్వీకరించారు. అరిందమ్ బాగ్చి ఐక్యరాజ్యసమితి, ఇతర అంతర్జాతీయ సంస్థలకు భారత తదుపరి శాశ్వత ప్రతినిధిగా నియమితులైన సంగతి తెలిసిందే. గతేడాది అక్టోబర్ 23న కేంద్రం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. 'అధికారాల బదిలీ జరిగింది. రణధీర్ జైస్వాల్ ఎంఈఏ అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించారు. నేను అంతర్జాతీయ వ్యవహారాలు చేపట్టనున్నాను' అని బాగ్చి ఎక్స్‌లో పేర్కొన్నారు. ఎంఈఏ నూతన అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ గతంలో న్యూయార్క్ కాన్సుల్ జనరల్‌గా పనిచేశారు. ఐరాసలో పోర్చుగల్, క్యూబా, దక్షిణాఫ్రికా, భారత శాశ్వత మిషన్ సభ్యులుగా సేవలందించారు.

న్యాయం చేయకుంటే మూల్యం తప్పదు

- ఓటుతో గుణపాఠం చెప్పటానికి బాధితులు రెడీ
- సంక్రాంతిలోపు రూ.10 లక్షలు చెల్లించాలి
- అగ్రిగోల్డ్ బాధితుల ధర్మ పోరాట దీక్ష ముగింపు సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: రాజకీయాలను తారుమారుచేసే శక్తి అగ్రిగోల్డ్ బాధితులకు ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఇచ్చిన హామీ వెంటనే అమలు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని వక్తలు గురువారం డిమాండ్ చేశారు. లేకపోతే వైసీపీ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ ఆసోసియేషన్ అధ్వర్యంలో 'నమ్మిన అగ్రిగోల్డ్ బాధితులను మోసం చేయకండి - ఇచ్చిన హామీ నిలబెట్టుకోండి' అని కోరుతూ విజయవాడలోని హనుమంతరాయ గ్రంథాలయంలో చేపట్టిన 30 గంటల ధర్మపోరాట దీక్షలో పాల్గొని నాయకులు సంఘీభావం ప్రకటించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేస్తేనే ఓట్లు వస్తాయని, ఎమ్మెల్యే స్థానాలు మార్చటం వల్ల కాదన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలను వేరే ప్రాంతానికి బదిలీ చేస్తే ఓట్లు పడతాయనుకోవడం అపోహ మాత్రమేనన్నారు. టికెట్ ఇస్తే ఎంతిస్తావని సీఎం జగన్ ఎమ్మెల్యే అభ్యర్థులతో బేరసారాలు చేస్తున్నారని విమర్శించారు. వెల్లంపల్లి శ్రీనివాస్, మంత్రి విడదల రజని సీట్లు మార్చారని, సొంత స్థానాల్లో విలువ తగ్గితే వేరేచోట ఎలా నెగ్గుకురాగలరని సందేహం వ్యక్తం చేశారు. ఇప్పుడు వలంటీర్లు కూడా రోడ్డెక్కుతున్నారని తెలిపారు. బాధితులకు న్యాయం చేయకుంటే బాదుడే.... బాదుడు అని హెచ్చరించారు.

తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల అంశాన్ని ప్రధాన సమస్యగా గుర్తించి తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని చంద్రబాబు తరపున హామీ ఇచ్చారు. ఇప్పటికే టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అగ్రిగోల్డ్ సమస్యపై ముఖ్యమంత్రికి లేఖ రాశారన్నారు. సీఎం జగన్ తలచుకుంటే పరిష్కారమవుతుందన్నారు. జగన్ తన కేసుల కోసం ఢిల్లీ నుంచి పెద్దపెద్ద న్యాయవాదులను పిలుపించుకుంటారని, మరి 10 లక్షల కుటుంబాలతో ముడిపడిన అగ్రిగోల్డ్ సమస్య కోసం ఒక్క న్యాయవాదిని నియమించలేరా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎన్ తులసిరెడ్డి మాట్లాడుతూ బడ్జెట్‌లో 0.4 శాతం నిధులు కేటాయించినా సమస్య పరిష్కారమయ్యేదన్నారు. 10 లక్షల మంది బాధితులు ఉన్నారని, వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 30 లక్షల మంది ఉన్నారని చెప్పారు. ఓట్ల దృష్టితో ఆలోచించైనా బాధితులకు న్యాయం చేయాలన్నారు. అగ్రిగోల్డ్ బాధితులు ఐకమత్యంగా పోరాడి విజయం సాధించాలని ఆకాంక్షించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి బలైన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా పువ్వుల్లో పెట్టి ఇస్తానని జగన్ ఇచ్చిన హామీ నమ్మిన బాధితులు ఈ రోజు దీక్షలో కూర్చున్నారని ఎద్దేవా చేశారు. ఫిర్యాదులు లేకపోయిన ప్రతిపక్ష నాయకుడిని జైల్లో పెట్టిన సీఐడీ... ఫిర్యాదులు ఉన్న అగ్రిగోల్డ్ కంపెనీ పెద్దలపై ఎందుకు చర్యలు తీసుకోవటం లేదని ప్రశ్నించారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ ఓటు అనే ఆయుధాన్ని సక్రమంగా వినియోగించుకుని అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారమయ్యేలా ఆలోచన చేయాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ పాలకులకు చిత్తశుద్ధి లేకపోవటం వల్లే అన్ని రంగాల ప్రజలు రోడ్డెక్కుతున్నారని చెప్పారు. అధికారంలోకి రాగానే మద్యనిషేధం చేస్తానని చెప్పిన జగన్ మోహన్‌రెడ్డి...మద్యాన్ని నిషేధించకపోగా కొత్త బ్రాండ్‌లు తీసుకువచ్చారని విమర్శించారు. పదేళ్ల పాటు ఎలాంటి హింసాత్మక ఘటనలు లేకుండా ఉద్యమాన్ని నడిపిస్తున్న ముప్పాళ్ల నాగేశ్వరరావును ఆమె అభినందించారు.

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ జనవరి 15వ తేదీలోపు అగ్రిగోల్డ్ కంపెనీ మోసానికి బలైన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, మిగిలిన బాధితులకు డిపాజిట్ మొత్తాన్ని ఎప్పుడు చెల్లిస్తారో తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వానికి ఇదే తుది హెచ్చరిక అన్నారు. 2017లో బాధితులు ఇదే వేదికపై దీక్ష చేస్తున్నప్పుడు జగన్‌కు ఆహ్వానం లేకపోయినా 10 మంది ఎమ్మెల్యేలతో వచ్చి చంద్రబాబు రూ.3 లక్షలు ఇస్తున్నారని, తాను అధికారంలోకి వస్తే రూ.10 లక్షలు పువ్వుల్లో పెట్టి పంపిస్తానని చేసిన వాగ్దానం ఏమైందని నిలదీశారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈవీ నాయుడు, కార్యనిర్వాహక అధ్యక్షుడు మల్లికార్జున, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి నాగలక్ష్మి, నాయకులు అగస్టీన్, గగన్, వీరభద్రం, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కంపెనీ మోసానికి, మానసిక ఒత్తిడికి లోనై ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబ సభ్యులు దాదాపు 200 మంది ధర్మపోరాట దీక్షలో కూర్చున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య అగ్రిగోల్డ్ బాధితుల కష్టసుఖాలు, ఇబ్బందులను ఉద్దేశించిన రాసిన గీతాలు ఆలపించారు. అగ్రిగోల్డ్ బాధితులకు వర్ల రామయ్య, ముప్పాళ్ల నాగేశ్వరరావు నిమ్మరసం ఇచ్చి దీక్షలు విరమింపజేశారు.

(ఫైల్ ఫొటో)

పోలీసులకు శుభాకాంక్షలు సిగ్గుచేటు: రామకృష్ణ

విశాలాంధ్ర-విజయవాడ: దళిత యువకుడిని హత్యచేసి డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్‌కు పోలీసులు వరుసలో నిలబడి పుష్పగుచ్ఛాలిచ్చి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలపడం పోలీసు వ్యవస్థకే సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. అనంత ఉదయ భాస్కర్ తన కారు డ్రైవరుగా పనిచేసిన సుబ్రమణ్యంను కొట్టి చంపి, ఇంటికి డోర్ డెలివరీ చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిందని రామకృష్ణ గుర్తుచేశారు. సుప్రీంకోర్టు బెయిల్‌పై బయట తిరుగుతున్న అనంతబాబును ప్రసన్నం చేసుకునేందుకు కొంతమంది పోలీసు అధికారులు క్యూ కట్టిన వార్తలు గుప్పుమంటున్నాయని, అందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమంలో వైరలవుతున్నాయని తెలిపారు. పోలీసు వ్యవస్థలో ప్రలోభాలకు, అవినీతికి ఇది అద్దంపడుతోందన్నారు. నేరస్తులకు కొమ్ముకాస్తూ వ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నుంచి ప్రతిపక్షాలకు, ప్రజాసంఘాలకు, ప్రజాతంత్రవాదులకు బెదిరింపులు, అరెస్టులు ఎదురవుతుంటే... మరోపక్క నేరస్తులకు, హంతకులకు ఘనస్వాగతాలు, ఊరేగింపులు, అభినందనలు జరుగుతున్నాయి పేర్కొన్నారు. 'డబ్బు, అధికారం ఉన్నోడిదే రాజ్యం' అన్న మాట జగన్‌మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనకు అద్దం పడుతోందని విమర్శించారు. నేరస్తుడైన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకే పోలీసులు సాగిలపడుతుంటే సుబ్రమణ్యం కుటుంబానికి న్యాయం ఎలా జరుగుతుందని ప్రశ్నించారు. దళితుల పట్ల వైసీపీ ప్రభుత్వం, పోలీసుల వివక్షను రామకృష్ణ ఖండించారు. ఎమ్మెల్సీ అనంతబాబుకు శుభాకాంక్షలు తెలిపేందుకు పోటీపడిన పోలీసులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి భారీ ఏర్పాట్లు

అతిథులకు ఇబ్బందులు రాకూడదు: మంత్రి నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి. కార్యక్రమానికి అంచనాలకు మించి జనం వచ్చే అవకాశముందని మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో నిర్మించిన అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ఈనెల 19న ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై నాగార్జున రాష్ట్ర సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. జనభాగిదారీ పేరిట అన్ని ప్రాంతాల నుంచి జనసమీకరణ కోసం ఏర్పాట్లను తెలుసుకున్నారు. 'స్మృతివనంలో అంబేడ్కర్ జీవిత విశేషాలు తెలిపే విగ్రహాలు, చిత్రాలు, ప్రదర్శనలు ఉన్నాయి. స్మృతివనం తొలి దశ పనులను రూ.268.46 కోట్లతో, మలిదశ పనులను రూ.106.64 కోట్లతో చేపట్టారు. రూ.400 కోట్లతో స్మృతివనాన్ని తీర్చిదిద్దారు' అని అన్నారు. విగ్రహ నిర్మాణం ఇప్పటికే పూర్తి కాగా లైటింగ్, పెయింటింగ్ జరుగుతున్నట్లు చెప్పారు. మినీ థియేటర్, మ్యూజియం, స్కై లైటింగ్, ఫౌంటెన్లు, విగ్రహం ముందు, వెనుక భాగాల్లో ఉద్యానవనాల సుందరీకరణ, భవనాలు, ప్రహరీ గోడల నిర్మాణం, లిఫ్టులు, వెహికల్ పార్కింగ్, ఫుడ్‌కోర్ట్ తదితర ప్రధాన పనులన్నీ దాదాపు పూర్తి అయ్యాయన్నారు. ప్రారంభోత్సవానికి దళితులు, దళిత సంఘాల నేతలు, అంబేడ్కర్ భావజాలాన్ని అభిమానించే వారంతా రావాలని నాగార్జున కోరారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నట్లు మంత్రి తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సాంఘిక సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి, అడిషనల్ డైరెక్టర్ రఘురామ్, ఎన్టీఆర్ జిల్లా జేసీ సంపత్, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ పాల్గొన్నారు.

సమ్మె మరింత ఉధృతం

- నేడు నిరాహారదీక్షలు
- అంగన్‌వాడీ సంఘాల నేతలు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): అంగన్‌వాడీలు ఇరవై నాలుగు రోజులుగా నిర్దిష్టమైన డిమాండ్లతో సమ్మె చేస్తున్నారని, తమ కోరికలు తీర్చకుండా ప్రభుత్వం ఎన్ని నిర్బంధాలకు, బెదిరింపులకు పాల్పడినా భయపడేది లేదని, తమ న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని అంగన్‌వాడీ సంఘాల నేతలు తేల్చి చెప్పారు. తమ ఆందోళనలో భాగంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శుక్రవారం అన్ని జిల్లా కేంద్రాల్లో నిరాహార దీక్షలు చేపట్టాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ), ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) నిర్ణయించాయి. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) నాయకురాలు ఎస్.మంజుల మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం, లెక్కలేనితనం కారణంగా అంగన్‌వాడీలు ఇప్పటివరకు పండగలన్నీ రోడ్ల మీదే చేసుకోవాల్సి వచ్చిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే సంక్రాంతి పండుగ కూడా రోడ్లమీద తప్పదని చెప్పారు. మంత్రుల బృందంతో జరిగిన చర్చలు కానీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో జరిగిన చర్చల్లో కానీ అంగన్‌వాడీల వేతనాల పెంపు, గ్రాట్యుటీ అమలుకు సంబంధించి నిర్దిష్ట హామీ ఇవ్వలేదన్నారు. మినీ వర్కర్లను ప్రధాన వర్కర్లుగా మారుస్తున్నట్లు హామీ ఇచ్చినప్పటికి జీవో ఇవ్వలేదన్నారు. సర్వీసులో ఉన్న అంగన్‌వాడీలు వందలమంది చనిపోయినా కనీసం బీమా అమలు చేయలేదన్నారు. కనీసం మట్టి ఖర్చులు కూడా ఇవ్వలేదన్నారు. అంగన్‌వాడీలకి సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదని, లబ్దిదారులకు నాణ్యమైన సరుకులు, ఫేస్ యాప్ రద్దు, తదితర అంశాల్లో ఎటువంటి స్పష్టత లేదన్నారు. అందు వల్ల సమ్మె కొనసాగించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. మహిళలను అవమాన పరుస్తున్నారన్నారన్నారు. సమ్మెను అణిచివేసే దిశగా కలెక్టర్లను రంగంలోకి దింపుతోందని ప్రభుత్వంపై మండిపడ్డారు. నాయకులు బేబీ రాణి, ఎం.నాగశేషు, శోభ పాల్గొన్నారు.

మోదీకి మమత సేవలు: అధీర్



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అధీర్ రంజన్ చౌదరి కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సేవ చేయడంలో మమతా బెనర్జీ బిజీగా ఉన్నారని ఆరోపించారు. మమతా బెనర్జీతో కాంగ్రెస్ పొత్తు కోరుకోవడం లేదని అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేయగలదని చెప్పారు. తాము భిక్ష అడగలేదని, మమతా బెనర్జీ స్వయంగా తనకు పొత్తు కావాలని చెప్పారని గుర్తుచేశారు. మమతా బెనర్జీ దయ తమకు అవసరం లేదని, తాము సొంతంగా ఎన్నికల్లో పోటీ చేయవచ్చని చెప్పారు. మోదీకి మమత సేవ చేయడంలో బిజీగా ఉన్నందున ఆమెతో పొత్తు కోరుకోవడం లేదని అధీర్ రంజన్ చౌదరి అన్నారు. ఈ ఏడాది జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్, టీఎంసీ పొత్తు గురించి అడిగినప్పుడు అధీర్ రంజన్ చౌదరి ఈ మేరకు స్పందించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లో కాంగ్రెస్‌కు టీఎంసీ రెండు సీట్లు మాత్రమే ఇస్తానని చెప్పింది. ఇండియా కూటమిలో ఉన్న ఈ రెండు పార్టీలు సీట్ల పంపకాల్లో భాగంగా ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే అధీర్ రంజన్ చౌదరి వివాదాస్పద వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. బీజేపీని గద్దె దింపే ధ్యేయంతో ప్రతిపక్షాలన్నీ కలిసి ఇండియా కూటమిగా ఏర్పడిన విషయం తెలిసిందే. కూటమిలో టీఎంసీ కీలక పాత్ర పోషిస్తోంది. రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రధాని అభ్యర్థిగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేరును మమత ప్రతిపాదించారు. కాగా, కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకాలపై ప్రస్తుతం సంప్రదింపులు జరుగుతున్నాయి.

శ్రీరాముడు మాంసాహారి: ఎన్సీపీ నేత



ముంబై: శ్రీరాముడిపై మహారాష్ట్రకు చెందిన ఎన్సీపీ నేత డాక్టర్ జితేంద్ర అవద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలోని షిర్డీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఎన్సీపీ నేత డాక్టర్ జితేంద్ర అవద్ మాట్లాడుతూ శ్రీరాముడు శాకాహారి కాదని, మాంసాహారేనని అన్నారు. 14 ఏళ్ల పాటు అడవిలో వనవాసం ఉన్న వ్యక్తి శాకాహారం కోసం ఎక్కడికి వెళ్తారని ప్రశ్నించారు. ఇది నిజమో కాదో ప్రజలే గ్రహించాలన్నారు. దేశ స్వాతంత్ర్యం గురించి ప్రస్తావించిన ఆయన ఎవరెన్ని చెప్పినా గాంధీ, నెహ్రూ కారణంగానే మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమ నేత గాంధీజీ ఓబీసీ అనే విషయాన్ని ఆర్ఎస్ఎస్ గుర్తుంచుకోవాలన్నారు. గాంధీజీ హత్యకు కారణం కులతత్వమేనని జితేంద్ర అవద్ వ్యాఖ్యానించారు. ఎన్సీపీ నేత వ్యాఖ్యలపై వివాదం చెలరేగింది. బీజేపీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ఎన్సీపీ నేతపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాతి హననం పాశవిక చర్య

పుస్తకావిష్కరణ సభలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ: ప్రపంచంతో ఒక జాతిని హననం చేయటమనేది పాశవిక చర్య అని వక్తలు అన్నారు. 34వ విజయవాడ పుస్తక మహోత్సవంలో గురువారం కేతు విశ్వనాథరెడ్డి వేదికపై 'పలస్తీనా' అంశంపై తెలుగులో వెలువడిన మూడు పుస్తకాల ఆవిష్కరణ, సమీక్ష కార్యక్రమం జరిగింది. ప్రోగ్రెసివ్‌ఫోరం అధ్యక్షుడు బుడ్డిగ జమిదార్ అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. 'పలస్తీనా స్వేచ్ఛకై గళమెత్తుదాం' పుస్తకాన్ని వీక్షణం సంపాదకులు ఎన్.వేణుగోపాల్ సమీక్షించారు. పలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు చేస్తుంటే చర్చించాల్సిన ప్రపంచం మౌనంగా ఉందన్నారు. ఐక్యరాజ్యసమితి జోక్యం చేసుకోవటం లేదన్నారు. చమురు దేశాల పక్కన మనకు సంబంధించిన బల్లెం ఒకటి ఉండాలని, సూయిజ్ కాల్వ ద్వారా వ్యాపారం జరుగుతున్న కారణంగా అక్కడా మన తొత్తు ఒకరు ఉండాలని భావిస్తున్న దేశాలు మౌనంగా ఉన్నాయన్నారు. పలస్తీనాకు సంఘీభావంగా తెలుగు నేలపై పుస్తకాలు రావటం అభినందనీయమన్నారు.

'మండిస్తూ మండే గాజా' పుస్తకాన్ని విరసం సీనియర్ నాయకులు సీఎస్ఆర్ ప్రసాద్ సమీక్షిస్తూ ఒక జాతిని నిర్మూలించటం అనేది ప్రతీకార యుద్ధం కాదన్నారు. మన దేశంలో ఉత్తరాఖండ్‌ను దేవ భూమిగా ప్రకటించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయని, గాజా లాంటి పరిస్థితులు మనదేశంలో కూడా రావచ్చని అన్నారు. 'నేల లేని దేశం' పుస్తకాన్ని వై.విజయ్ కుమార్ మార్క్సిస్టు అధ్యయన కేంద్రం కన్వీనర్ జేవీ సత్యనారాయణ మూర్తి సమీక్షించారు. ఇజ్రాయిల్ విషయంలో భారతదేశం గతం కన్నా భిన్నంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇజ్రాయిల్‌కు వంత పాడుతోందన్నారు. చిన్నతనంలో తాము యాసర్ అరాఫత్‌ను హీరోగా భావించే వారమని ఆనాటి పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. చివరిగా ఇప్టా జాతీయ నాయకులు పి.ప్రసాద్ స్పందన తెలియజేస్తూ తరలింపు, తరిమివేత, నిర్మూలన అనే పద్ధతుల్లో జాతిని అంతం చేస్తారని చెప్పారు. ఆసియా ఖండంలో రోహింగ్యాలను కూడా మెల్లగా నిర్మూలించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు.

దేశం గర్వించే తత్వవేత్త సచ్చిదానందమూర్తి

రచయిత యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): మనోవేదనలకు కారణాలు, సమాధానాల వెతుకులాటను బాధ్యతగా వ్యవహరించిన తత్వవేత్త కొత్త సచ్చిదానందమూర్తి అని ప్రముఖ రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. 34వ విజయవాడ పుస్తకమహోత్సవంలో గురువారం కేతు విశ్వనాథరెడ్డి సాహిత్యవేదికపై సచ్చిదానందమూర్తి రచించిన కారుమబ్బులు వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. సచ్చిదానందమూర్తి జాతి గర్వించదగ్గ తత్వవేత్త అని కొనియాడారు. మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ సచ్చిదానందమూర్తి విశిష్టతను, రచనలను నేటితరానికి పరిచయం చేయాలన్నారు. సచ్చిదానందమూర్తి రచనల మళ్లీ ముద్రిస్తున్నట్లు తెలిపారు. సిద్ధార్థ ఆర్ట్స్ కాలేజి ప్రిన్సిపాల్ జంపాలరాజేశ్ అధ్యక్షతన జరిగిన సభలో డా. వెలగాజోషి, ప్రొఫెసర్ కొత్త రమేశ్, డా.గుమ్మా సాంబశివరావు, డా.సురేంద్ర పాల్గొన్నారు.

పోరాటయోధురాలు సుధా భరద్వాజ్

జాతీయస్థాయిలో స్త్రీల హక్కులకోసం, సామాన్యుల కోసం పోరాడిన ధీరవనిత సుధా భరద్వాజ్ అని ప్రముఖ రచయిత్రి కాత్యాయనీ విద్మహే కొనియాడారు. ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన సుధా భరద్వాజ్ రచన 'ఉరిగది నుండి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. మహిళా ఖైదీల మానసిక స్థితిని 'ఉరిగది నుండి'తో వర్ణించారన్నారు. న్యాయవాది సుంకర రాజేంద్రప్రసాద్, శాసనమండలి మాజీ సభ్యుడు విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఖైదీల వెతలకు అక్షరరూపం ఇచ్చిన రచయిత్రి అని కొనియాడారు. కె.లక్ష్మయ్య అధ్యక్షతన జరిగిన సభలో ప్రజాశక్తి బుక్‌హౌస్ పూర్వ సంపాదకులు కె.ఉషారాణి, స్వరూపరాణి పాల్గొన్నారు.

'పంజాబ్ బచావో యాత్ర' రాజకీయ గిమ్మిక్కు

ఎస్ఏడీపై ధ్వజమెత్తిన పంజాబ్ సీఎం మాన్

చండీగఢ్: శిరోమణి అకాలీదళ్ చేపట్టిన 'పంజాబ్ బచావో యాత్ర' ఒక 'రాజకీయ గిమ్మిక్కు'గా పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ గురు వారం అభివర్ణించారు. పంజాబ్‌ను అకాలీదళ్ నుంచి రక్షించడానికి యాత్రగా పేరు మార్చాల న్నారు. అనేక అంశాల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, శిరోమణి అకాలీదళ్ (ఎస్ఏడీ) బుధవారం మాన్ నేతృత్వంలోని పాలనను 'బహిర్గతం' చేయడానికి ఫిబ్రవరి 1 నుంచి 'పంజాబ్ బచావో యాత్ర' నిర్వహించనున్నట్లు తెలిపింది. అయితే ముఖ్యమంత్రి దీనిని తిప్పికొడుతూ 'రాజకీయ గిమ్మిక్కు' అని అన్నారు. 'అకాలీలు తమ 15 సంవత్సరాల దుష్ట పాలనలో కనికరం లేకుండా రాష్ట్రాన్ని నాశనం చేశారు. అందువల్ల యాత్ర అసలు పేరు 'అకాలీ దళతో పంజాబ్ బచా లో యాత్ర' అని మాన్ ఒక ప్రకటనలో తెలిపారు. 'దీని కారణంగా రాష్ట్రంలోని పురాతన రాజకీయ పార్టీ నేడు తీవ్ర సంక్షోభంలో ఉందని, రాష్ట్రాన్ని ఎక్కువ కాలం పాలిం చిన తరువాత వారు నేడు మూడు (117 అసెంబ్లీలో) స్థానాలకు పరిమితమ య్యారని అన్నారు. 'అకాలీలు, బాదల్ కుటుంబానికి చెందిన సందేహాస్పద స్వభావం గురించి పంజాబ్ ప్రజలకు బాగా తెలుసు. దీని కారణంగా వారి నాటకాలు ఇప్పుడు పని చేయవు' అని మాన్ అన్నారు. ఎస్ఏడీ సుదీర్ఘ 'దుష్పరిపాలన' సమయంలో పంజాబ్ అన్ని రంగాలలో వెనుకబడి ఉందని తెలిపారు. 'పంజాబ్ మొత్తం క్రూరమైన వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా నిలబడినప్పుడు, ఆ సమయంలో అకాలీలు తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో సిగ్గు లేకుండా నిలబడటాన్ని ప్రజలు ఎప్పటికీ మరచిపోలేరు' అని విమర్శించారు.

మూడు నెలల్లో ఎన్నికల నియమావళి వస్తుంది

సుప్రీంకోర్టు తీర్పుపై కాంగ్రెస్

న్యూఢిల్లీ: ప్రముఖ కార్పొరేట్ సంస్థ అదానీ గ్రూప్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కాంగ్రెస్ స్పందించింది. అత్యున్నత న్యాయస్థానం వెలువరించిన తీర్పు పూర్తిగా సెబీకి అనుకూలంగా ఉందని తెలిపింది. అదానీ గ్రూప్ కంపెనీలపై ఆరోపణలు వచ్చిన తర్వాత కోర్టు సమగ్ర విచారణ చేయమని ఆదేశించి పది నెలలు అయిందని గుర్తుచేసింది. అయినా సెబీ తన దర్యాప్తు పూర్తి చేయడంలో విఫలమైందని పార్టీ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. అదానీ గ్రూప్ కంపెనీలపై వచ్చిన 24 పిటిషన్లకుగాను 22 పిటిషన్ల దర్యాప్తు పూర్తి చేసిన నిపుణుల కమిటీ...మరో మూడు నెలల్లో సమగ్ర విచారణ పూర్తి చేయాలని సెబీని ఆదేశించిన విషయం తెలిసిందే. దానిపై కాంగ్రెస్‌పార్టీ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేశ్ స్పందిస్తూ లోక్‌సభ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రావడం తప్ప రాబోయే మూడు నెలల్లో ఏ మార్పురాదన్నారు. అయితే సెబీని ప్రశ్నించేందుకు వార్తా నివేదికలు, మీడియా కథనాలు ప్రత్యామ్నాయం కాదనే విషయంపై అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో ఏకీభవించారు. సెబీ సమగ్ర దర్యాప్తు జరుపుతోందని, ఈ దశలో సెబీ దర్యాప్తుపై జోక్యం చేసుకోలేమని సుప్రీంకోర్టు నిన్న స్పష్టం చేసింది. దర్యాప్తును సెబీ నుంచి సిట్ లేదా సీబీఐకి బదిలీ చేయాలన్న వాదనలో అర్థం లేదని కొట్టిపారేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జేబీ పార్దీవాలా, మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం 46 పేజీల తీర్పు వెలువరించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.